




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు









సంపుటి : 1 సంచిక : 168 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు ఆదివారం 22 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :168 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SUN 22 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఆ 'నాటకాల రాయుడు' రోజుకో వేషం వేశాడు

- తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ దోషులను కఠినంగా శిక్షిస్తామన్న సీఎం
- అక్రమాల నుంచి తప్పించుకోడానికే హెరిటేజ్ పై వైసీపీ నిందలు
- అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా వైసీపీ బూతుల పార్టీనేనని విమర్శ
- రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యతలో ప్రజలు కలిసిరావాలని పిలుపు
- గత ప్రభుత్వం రాష్ట్రాన్ని గంజాయిమయం చేసిందని ఆరోపణ



**పెన్ పవర్ డెస్క్:**గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జరిగిన నెయ్యి కల్తీ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ మహా పాపానికి పాల్పడిన నిందితులను నడిరోడ్డుపై నిలబెట్టి శిక్షిస్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. వారి కల్తీ అక్రమాల నుంచి తప్పించుకోవడానికే ఇప్పుడు హెరిటేజ్ సంస్థపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 2024కు ముందు తిరుమల దర్శనానికి వెళ్లిన ప్రతి భక్తుడికి లడ్డూ ప్రసాదం నాణ్యత తగ్గిపోయిన విషయం అనుభవంలోకి వచ్చిందన్నారు. శ్రీవారి ప్రసాదం పవిత్రతను దెబ్బతీసే అధికారం ఎవ్వరికీ లేదని, కానీ గత పాలకులు దాన్ని అపవిత్రం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. "వారు కొనుగోలు చేసిన నెయ్యి నమూనాలను గుజరాత్‌లోని నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డుకు (చీణణదీ) పరీక్షల నిమిత్తం పంపిస్తే, అది అసలు నెయ్యే కాదని, అందులో జంతువుల కొవ్వు కలిసిందని ల్యాబ్ నివేదిక ఇచ్చింది. దీనిపై ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సెట్) సైతం తన నివేదికలో కీలక విషయాలను వెల్లడించింది. సరఫరా చేసింది నెయ్యి కాదని, కేవలం రసాయనాలతో తయారు చేసినట్లు తేల్చింది" అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ తప్పును తాము బయటపెడుతుంటే, దొంగే దొంగా అని అరిచినట్లుగా తిరిగి ప్రభుత్వంపైనే బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆక్షేపించారు.

**నాటకాల రాయుళ్లది రోజుకో వేషం**

వివేకానంద రెడ్డి హత్య ఘటనను ప్రస్తావిస్తూ... ఆ 'నాటకాల రాయుడు' రోజుకో వేషం వేశాడని, చివరకు తన చిన్నాన్న కుమార్తె కూడా మోసపోయేలా నాటకాలు రక్తి కట్టించాడని పరోక్షంగా జగన్‌ను ఉద్దేశించి విమర్శించారు. అలాంటి వారే ఇప్పుడు తిరుమల నెయ్యి విషయంలోనూ

- మిగతా 2లో



## కాంగ్రెస్ కార్యకర్తల నిరసన దిగ్భ్రాంతి కలిగించింది

- ఏఐ సదస్సులో యూత్ కాంగ్రెస్ ఆందోళనపై మంత్రి లోకేశ్ ఆగ్రహం
- దేశ ప్రతిష్ఠ దెబ్బతీసేలా వ్యవహరించారని తీవ్ర విమర్శ
- ప్రతిష్టాత్మక వేదికలను రాజకీయాలకు వాడుకోవడం సరికాదన్న లోకేశ్
- ఆవిష్కరణలపై దృష్టిపెట్టి దేశాన్ని నిర్మించుకోవాలని పిలుపు

**పెన్ పవర్ డెస్క్:**ఢిల్లీలో నిన్న "ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026"లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు సృష్టించిన గందరగోళంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం, విచారం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వేదికపై వారి ప్రవర్తన దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. ఏఐ రంగంలో ఎదుగుతున్న

- మిగతా 2లో



## 'ఏఐ'ని అదుపుచేసి ముందుకు వెళ్లాలి..

### మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమో

### వెంకయ్యనాయుడు ఆందోళన

- విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండకుండా ఏఐని కట్టడి చేయాలన్న మాజీ ఉప రాష్ట్రపతి
- మన కట్టు, బొట్టుకు ప్రాధాన్యత ఇవ్వాలన్న వెంకయ్యనాయుడు
- భారత్ విశ్వగురువు అయినా ఏ దేశం మీదా దండయాత్ర చేయలేదన్న వెంకయ్యనాయుడు

- మిగతా 2లో



## వైసీపీని, జగన్ ను హిందువులకు దూరం చేసే కుట్ర జరుగుతోంది

- తిరుమల లడ్డూపై చంద్రబాబు అసత్యాలు ప్రచారం చేశారన్న మల్లాది విష్ణు
- సీబీఐ రిపోర్టు వచ్చినా జగన్ పై బురద చల్లుతున్నారని మండిపాటు
- ఏకసభ్య కమిషన్ ప్రభుత్వ కనుసన్నల్లోనే ఉంటుందని వ్యాఖ్య

- మిగతా 2లో

## ఈ నెల 26 నుంచి జనసేన ఉద్యమి సభ్యత్వాలు..

### నాదెండ్ల మనోహర్ కీలక సూచనలు

- పార్టీ నేతలతో నాదెండ్ల మనోహర్ టెలీకన్ఫరెన్స్
- క్షేత్రస్థాయిలో భారీగా సభ్యత్వాలు చేయించాలని సూచన
- జెన్ జీని పార్టీకి దగ్గర చేయాలన్న నాదెండ్ల



**పెన్ పవర్ డెస్క్:**జనసేన పార్టీ బలోపేతం దిశగా ఆ పార్టీ మరో కీలక అడుగు వేస్తోంది. జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం

- మిగతా 2లో



## ఏపీ లిక్కర్ కేసులో కీలక మలుపు.. వాసుదేవరెడ్డి అరెస్ట్

- ఏపీబీసీఎల్ మాజీ ఎండి వాసుదేవరెడ్డిని అరెస్ట్ చేసిన సీఐడీ
- ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, కీలక పత్రాలు చోరీ చేశారంటూ కేసు నమోదు
- ఇప్పటి వరకు అజ్ఞాతంలో ఉన్న వాసుదేవరెడ్డి

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ లిక్కర్ స్కామ్ దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసు కుంది. తాజాగా మరో అరెస్ట్ జరిగింది. ఆంధ్రప్రదేశ్ బెవరేజెస్ కార్పొరేషన్ (ఏపీబీసీఎల్) మాజీ ఎండీ,

- మిగతా 2లో

## నక్సల్స్ ను ఏరివేసినట్లే చొరబాటుదారులను కూడా ఏరివేయడం సాధ్యమే

- అక్రమ వలసదారులను ఓటరు జాబితా నుంచే కాదు దేశం నుంచి తొలగిస్తామన్న అమిత్ షా
- అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని రాహుల్ గాంధీ చెప్పారన్న అమిత్ షా
- కానీ కాంగ్రెస్‌కు వారే ఓటు బ్యాంకు కాబట్టి పంపించలేరని విమర్శ

**పెన్ పవర్ డెస్క్:**నక్సల్స్ ను ఏరివేసినట్లే చొరబాటుదా రులను కూడా ఏరివేయడం సాధ్యమేనని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. అసోంలోని కామ్‌రూప్‌లో పోలీస్ శాఖ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రమ వలసదారులను కేవలం ఓటరు జాబితా నుంచి మాత్రమే కాదని, దేశం నుంచి కూడా తొలగిస్తామని అన్నారు. చొరబాటుదారులు ఆక్రమించిన స్థలాల నుంచి వారిని తరిమికొడితే మరోచోట నివాసం ఏర్పరుచుకునే అవకాశం ఉందని,

- మిగతా 2లో






## ముగిసిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026...

- న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు 88 దేశాల ఆమోదం
- ఏఐపై ప్రపంచ ఏకాభిప్రాయం
- సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' స్ఫూర్తితో డిక్లరేషన్ రూపకల్పన
- ఏడు కీలక స్తంభాల ఆధారంగా ఏఐపై అంతర్జాతీయ సహకారానికి పిలుపు
- ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఉపయోగించాలని తీర్మానం

**పెన్ పవర్ డెస్క్:**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అంత ర్జాతీయ సహకారానికి సంబంధించి భారత్ కీలక ముందడుగు వేసింది. న్యూఢిల్లీ వేదికగా జరిగిన మెగా 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సులో 'న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్'ను ఆమోదించారు. భారత్‌తో సహా 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు దీనికి మద్దతు తెలపడం ప్రపంచ ఏకాభిప్రాయానికి నిదర్శనంగా నిలిచిం ది. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఎలా ఉపయోగించు కోవాలనే దానిపై ఈ డిక్లరేషన్ ఒక స్పష్టమైన మార్గాన్ని

- మిగతా 2లో

## కొండాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్.. రూ.1,400 కోట్ల విలువైన భూమికి రక్షణ

- కొండాపూర్‌లో 7 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా
- కబ్జాకు గురైన పార్కులు, ప్రజావసరాల స్థలాలను స్వాధీనం చేసుకున్న హైడ్రా
- ఆక్రమణలు తొలగించి, స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన అధికారులు
- కాలనీ సంక్షేమ సంఘం ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం
- దశాబ్దాల సమస్య పరిష్కారమవడంతో స్థానికుల ఆనందం

- మిగతా 2లో




## భారతీయులే లక్ష్యంగా జైషే మహమ్మద్ భారీ కుట్ర

- యువతులతో భారతీయుల క్లబ్బులు, బార్లపై దాడులు... జైషే అంతర్జాతీయ కుట్ర!
- పబ్‌లు, క్లబ్బుల్లో దాడులకు యువతులను నియమించుకుంటున్న ఉగ్రసంస్థ
- పాక్ ప్రమేయం బయటపడకుండా విదేశీ మహిళల నియామకం
- గాజా సహాయం పేరుతో దాడులకు భారీగా నిధుల సేకరణ
- ప్రపంచవ్యాప్తంగా ఏకకాలంలో దాడులు జరపాలని ప్లాన్

- మిగతా 2లో



## పరీక్షలు ఉన్నాయని ఆందోళన వద్దు

### ఇంటర్ విద్యార్థులకు కవిత సూచన



- ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలని సూచన
- పరీక్షలు బాగా రాయలేననే ఆందోళన వద్దన్న కవిత
- పరీక్షలు అనేవి పూర్తి జీవితంలో చిన్న అంశమని వ్యాఖ్య

- మిగతా 2లో



## మన స్నేహాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటా

- మేకపాటి గౌతమ్ రెడ్డి వర్ధంతి నేడు
- 2022 ఫిబ్రవరి 21న గుండెపోటుతో మృతి చెందిన గౌతమ్ రెడ్డి
- గౌతమ్ రెడ్డిని స్మరించుకున్న జగన్

**పెన్ పవర్ డెస్క్:**మాజీ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి వర్ధం తి నేడు. ఈ సందర్భం గా తన స్నేహితుడు గౌతమ్ రెడ్డిని వైసీపీ అధినేత జగన్ స్మరించుకున్నారు.

- మిగతా 2లో




# ఆ 'నాటకాల రాయుడు' రోజుకో వేషం వేశాడు

- మొదటి పేజి తరువాయి
అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. మసీదు, చర్చి, దేవాలయం ఏదైనా వాటి పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందుకే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే టీటీడీలో ప్రక్షాళన ప్రారంభించామని తెలిపారు. శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు వెంకటేశ్వర స్వామి ఫొటోలను చెప్పులతో పట్టుకుని, సభలో రాజకీయం చేసి, ఆ తర్వాత ఫొటోలను అక్కడే పడేసి వెళ్లారని, వారికెందుకు ఇంత అహంకారమని ప్రశ్నించారు.

**అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా అది బూతుల పార్టీనే**

వైసీపీ నేతల భాషపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గతంలో అసెంబ్లీలో నా భార్యపై అత్యంత నీచంగా మాట్లాడి వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఆ పార్టీ బూతులు మాట్లాడటం మాత్రం మానలేదు. ఆబోతుల మాదిరిగా తయారై రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. వారితో తిట్టించుకోవడానికే మనం రాజకీయం చేస్తున్నామా?" అని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొందరు చెత్త రాజకీయాలు, రౌడీ రాజకీయాలు చేస్తున్నారని, పరామర్శల పేరుతో వెళ్లి అమాయకులను తమ కార్ల కింద తొక్కించి చంపుతారని, కానీ వారిని పరామర్శించరని విమర్శించారు.

**రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలి**

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని ఆర్థికంగా విధ్వంసం చేశారని, పరిశ్రమలను తరిమికొట్టి ఆంధ్రప్రదేశ్‌పై ఉన్న నమ్మకాన్ని పోగొట్టారని చంద్రబాబు ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులు, కార్యాలయాలు, భవిష్యత్ ఆదాయాన్ని సైతం తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర పునర్నిర్మాణం ప్రారంభమైందని తెలిపారు.

గత పాలకులు రాష్ట్రాన్ని గంజాయిమయం చేశారని, తమ ప్రభుత్వంలో మత్తు పదార్థాలు సేవించి ఆడబిడ్డల జోలికి వస్తే అదే వారికి చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందనే భయంతోనే మదనపల్లి అత్యాచార కేసులో నిందితుడు ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తుచేశారు. శాంతిభద్రతలకే తన తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. చెడును నిరాకరించే శక్తి ప్రజల్లో వచ్చినప్పుడే రాజకీయ ప్రక్షాళన సాధ్యమవుతుందని, రాష్ట్రాన్ని కాపాడుకునే ఈ బృహత్కార్యంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## బుర్రకథా పితామహుడు నాజర్

ప్రాచీన జానపద కళారూపమైన బుర్రకథకు కొత్త జీవం పోసి, మెరుగులు దిద్ది, ప్రత్యేక ఆహార్యంతో తగిన హావ భావలతో ఎన్నో ప్రదర్శనలిచ్చి బుర్రకథా ప్రక్రియకు విస్తృత ప్రచారం కల్పించిన బుర్రకథా పితామహుడు నాజర్, నటుడు, ప్రజారచయిత, గాయకుడు. " ఈ గండపెండేరాలూ, ఊరేగింపులూ, సన్మానాలూ, పద్మశ్రీలూ అన్నీ కలిపి, నాకు జనం వేసే ఒక్క ఈలతో సాటి కాదు" అని తన కళను ప్రజా ప్రయోజనానికే అంకితం చేసిన ప్రజా కళాకారుడు. అంగాంగ విన్యాసాల ద్వారా ఆటపాట ద్వారా జాతిని మేల్కొలిపి ఉత్తేజపరిచిన గొప్ప ప్రతిభాశాలి షేక్ నాజర్.నాజర్ ప్రతిభకు ముగ్ధుడైన సినీ సంగీత దర్శకులు సాలూరు రాజేశ్వరరావు సినీరంగంలో స్థిరపడమని కోరినా, ఆ లోకం తన లోకం కాదని సవినయంగా చెప్పి, జనపదమే తన పథమని బుర్రకథలు చెప్పుకుంటూ జనంతో మమేకమై, జీవితాంతం ప్రజా కళాకారుడిగా కొనసాగిన ప్రజా గాయకుడు నాజర్. బుర్రకథా పితామహుడుగా పేరొందిన షేక్ నాజర్ (ఫిబ్రవరి 5, 1920 – ఫిబ్రవరి 22, 1997) బుర్రకథా కళాకారుడు, నటుడు, ప్రజా రచయిత, గాయకుడు. పద్మశ్రీ అవార్డు గ్రహీత. గుంటూరు జిల్లా పొన్నెకల్లు గ్రామంలో ఓ పేద దూదేకులముస్లిం కుటుంబంలో 1920, ఫిబ్రవరి 5 వ తేదీన షేక్ మస్తాన్, బీబాబీలకు దంపతులకు జన్మించారు. నాజరు పూర్తి పేరు "షేక్ నాజరు వలి". మహ్మదీయ సభ పేరిట నాటకా లాడి మంచిపేరు గడించారు. ఆయన కృష్ణలీలలో దేవకి, శ్రీ కృష్ణ తులాభారంలో రుక్మిణి, భక్త రామదాసులో ఛాందిని వంటి ఆడవేషాలు వేసి మెప్పించారు. పాదుకా పట్టాభిషేకంలో కైకేయి, ఖిల్జీ రాజ్యపతనంలో కమలారాణి పాత్రలు పోషించారు. పాఠశాల స్థాయిలో "ద్రోణ" పాత్రకు జీవం పోశారు. ఆర్యమత సిద్ధాంతం నచ్చి మాంసాహారం మానేశారు. నాస్తికుడయ్యారు. తెనాలిలోని "బాలరత్న నాటక సమాజం"లో ప్రారంభమైన నాజర్ కథాకథన ప్రస్థానం నాలుగు దశాబ్దాలు సాగింది. కమ్యూనిస్టు పార్టీలోచేరి ప్రజానాట్య మండలి వేదిక ద్వారా పార్టీ సిద్ధాంతాలను కార్యక్రమాలను బుర్రకథల ద్వారా ప్రచారం చేశారు. వీరిని 1940వ దశకంలో కమ్యూనిస్టు పార్టీ నెల జీతం మీద కథలు చెప్పించి పల్లెలలో తమ పార్టీ ప్రచారానికి ఉపయోగించు కున్నది. పల్నాటి యుద్ధం, వీరాభిమన్యు, బొబ్బిలి యుద్ధం, అల్లూరి సీతారామరాజు, ప్రహ్లాద, క్రీస్తు, బెంగాల్ కరువు మొదలగు ఇతివృతాలలో నమకాలీన రాజకీయాలు జోడించి బుర్రకథలు రూపొందించారు. పద్మశ్రీ నాజర్ జీవిత చరిత్రను అంగడాల వెంకట రమణమూర్తి... పింజారీ అనే పుస్తకంగా ప్రచురించాడు. కొంతకాలం విరసం సభ్యులుగా ఉన్నారు.అగ్గిరాముడు, బలేబావ, నిలువు దోపిడీ, పెత్తందార్లు, పుట్టిల్లు, మనుషులంతా ఒక్కటే – సినిమాల్లో నాజర్ బుర్రకథలు కన్పిస్తాయి. పూల రంగడు సినిమాలో "అక్కినేని"కి నేర్పించారు. చాలా మందికి ఈ గాంధర్వ విద్య నేర్పారు. ఆయన గళ గాంభీర్యాన్ని, మాధుర్యాన్ని గమనించి, "ఆసామీ" నాటకాన్ని రచించారు. ఆంధ్రనాటక కళాపరిషత్తు పోటీల్లో ఆసామీ నాటకం ప్రథమ బహుమతి పొందింది. నాజర్ ఏడుసార్లు జైలు జీవితాన్ని అనుభవించారు.ఆంధ్రనాటక అకాడమీ 1981లో "ఉత్తమ కళాకారుడు" అవార్డుతో సత్కరించింది. 1986 లో భారత ప్రభుత్వం "పద్మశ్రీ" బిరుదుతో నాజరును సత్కరించింది. రంగస్థల మహానటుడు బళ్లారి రాఘవా చార్యులు, నాజరు బుర్రకథ విని అమితానందంతో బళ్లారికి ఆహ్వానించడం, మద్రాసులో ప్రదర్శన చూచిన గోవిందరాజుల సుబ్బారావు నాజరుని అభినందిస్తూ కౌగిలించు కోవడం, ప్రముఖ పాత్రికేయుడు కె. అబ్బాస్ నాజరును "ఆంధ్ర అమరషేక్" అని అభివర్ణించడం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నాజరు ప్రజా భాషకు ముగ్ధుడై "నా బిడ్డడు ఎంత ఎదిగిపోయాడో" అని ఆలింగనం చేసుకోవడం, నాజరు లోని కళా ప్రతిభకు తిరుగులేని నిదర్శనాలు."నాటకాల్లో బుర్రకథ బ్రహ్మ నాజర్ దగ్గర శిక్షణ తీసుకోవటం నా నట జీవితానికి పట్టం కట్టింది" అని ప్రముఖ నటి జమున వ్యాఖ్యానించారు. గుంటూరుకు ఎన్‌టిఆర్ వచ్చినప్పుడు "నేను మీ అభిమానిని" అని నాజర్ చెపితే... "నేను మీ ఫాన్‌ను" అని ఎన్‌టిఆర్ చెప్పి అందరినీ ఆనంద పరిచారు. "హరికథకు ఆదిభట్ల ఎలాంటివాడో బుర్రకథకు నాజర్ అలాంటివాడు" అని ముదిగొండ శివప్రసాద్ తదితరప్రముఖుల అభిప్రాయాలు ఉంటే నాజర్ గొప్పతనం స్పష్టం అవుతున్నది. కటిక పేదరికాన్ని మరణించే వరకు అనుభవించిన నాజర్ 1997, ఫిబ్రవరి 22 న అంగలూరులో మరణించారు.

## ముగిసిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026...

- మొదటి పేజి తరువాయి
నిర్దేశిస్తోం ది.'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' (అందరి సంక్షేమం, అందరి ఆనందం) అనే భారతీయ తాత్విక సూత్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ డిక్లరేషన్‌ను రూపొందించారు. ఏఐ ద్వారా లభించే ప్రయోజనాలు ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలనే ఆశయాన్ని ఇది పునరుద్ఘాటించింది. "వసుధైవ కుటుంబకం" (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే భావనతో, అన్ని దేశాలు తమ పౌరుల ప్రయోజనాల కోసం ఏఐని అభివృద్ధి చేసి, వినియోగించుకునేలా వనరులను అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రాముఖ్యతను ఈ తీర్మానం నొక్కి చెప్పింది.

అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడం, అన్ని భాగస్వామ్య పక్షాలను కలుపుకొనిపోవడం, దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం, విశ్వసనీయమైన ఫ్రేమ్‌వర్క్‌ల ద్వారా ఏఐ పురోగతిని ప్రోత్సహించడం వంటి అంశాలకు ఇందులో ప్రాధాన్యత ఇచ్చారు.

**ఈ డిక్లరేషన్ ఏడు కీలక స్తంభాల ఆధారంగా రూపొందింది.**

1. ఏఐ వనరుల ప్రజాస్వామ్యీకరణ (Democratising AI Resources)
2. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు (Economic Growth and Social Good)
3. సురక్షితమైన, విశ్వసనీయమైన ఏఐ (Secure and Trusted AI)
4. శాస్త్రీయ ప్రగతికి ఏఐ (AI for Science)
5. సామాజిక సాధికారతకు ఏఐ లభ్యత (Access for Social Empowerment)
6. మానవ వనరుల అభివృద్ధి (Human Capital Development)
7. స్థిరమైన, సమర్థవంతమైన, వినూత్నమైన ఏఐ వ్యవస్థలు (Resilient, Efficient and Innovative AI Systems)

"ఏఐని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలంటే పటిష్టమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, అందరికీ అందుబాటులో ఉండే అర్థవంతమైన కనెక్టివిటీ అత్యంత అవసరం" అని ఈ డిక్లరేషన్ స్పష్టం చేసింది. ఓపెన్ సోర్స్, ఇంధన సామర్థ్యం గల ఏఐ మౌలిక సదుపాయాల అవసరాన్ని కూడా ఇది హైలైట్ చేసింది. చార్టర్ ఫర్ ది డెమొక్రాటిక్ డిఫ్యూజన్ ఆఫ్ ఏఐ' అనే స్వచ్ఛంద, నిర్బంధం లేని ఫ్రేమ్‌వర్క్‌ను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇది జాతీయ చట్టాలను గౌరవిస్తూనే, ఏఐ వనరులను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి, స్థానిక ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి దోహదపడుతుంది.శాస్త్రీయ పరిశోధన, అభివృద్ధి, పాలన, ప్రభుత్వ సేవల వంటి రంగాల్లో ఏఐ పాత్రను విస్తరించాలని డిక్లరేషన్ పిలుపునిచ్చింది. సురక్షితమైన, నమ్మకమైన ఏఐ వ్యవస్థలను నిర్మించడం ద్వారానే ప్రజల్లో విశ్వాసం పెరిగి, దాని పూర్తి ప్రయోజనాలను పొందగలమని పేర్కొంది. ఈ సమ్మిట్ ద్వారా ఏర్పడిన ఏకాభిప్రాయం, భవిష్యత్తులో ఏఐని మానవాళి ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపయోగించుకోవడానికి అవసరమైన అంతర్జాతీయ సహకారానికి మార్గం సుగమం చేస్తుందని సభ్య దేశాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

## 'ఏఐ'ని అదుపుచేసి ముందుకు వెళ్లాలి..

కృత్రిమ మేధ(ఏఐ)ని అదుపుచేసి ముందుకె ళ్లాల్సిన అవసరం ఉందని మాజీ ఉప రా ష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఏఐ వస్తే మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమోననే భయం తనకు ఉందని అన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండకుండా ఏఐని కట్టడి చేయాల్సి ఉందని అన్నారు. విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశాన్ని, మాతృభాషను, చదువుకున్న విద్యా సంస్థను, గురువులను మరిచిపోకూడదని అన్నారు. మన కట్టు, బొట్టుకు ప్రాధాన్యత ఇవ్వాలని, తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని అన్నారు. యువత పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. మన పూర్వీకులు మనకు అందించిన సంప్రదాయాలని భావితరాలకు అందించాలని వ్యాఖ్యానించారు. భారత్ విశ్వగురువు అయినప్పటికీ ఏ దేశం మీదా దండయాత్ర చేయలేదని గుర్తు చేశారు. భారత్ సత్తాను ప్రపంచ వేదికల మీద మన వారు చాటుతున్నారని ప్రశంసించారు. కులం కంటే గుణం మిన్న అనే విషయాన్ని అందరూ గుర్తించాలని అన్నారు. డిగ్రీల కంటే పరిజ్ఞానం ముఖ్యమని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాంకేతికతకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో చాలా రంగాల్లో ఉద్యోగాలు పోయే అవకాశం ఉందని, దీని గురించి మాట్లాడాల్సిన అవసరం ఉందని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో నాయకులు బూతులు విపరీతంగా మాట్లాడుతున్నారని, గత ఎన్నికల్లో బూతులు మాట్లాడిన వారు ఓడిపోయారని వెల్లడించారు.

సమాజం కూడా అలాంటి వాళ్లను బహిష్కరించాలని హితవు పలికారు. రామాయణాన్ని అన్ని పాఠ్యపుస్తకాల్లో పొందుపరచాలని అన్నారు.

తల్లిదండ్రులు, ఇంట్లోని పెద్దలు తమ పిల్లలకు ఎక్కువ సమయం కేటాయించాలని వెంకయ్యనాయుడు సూచించారు. విద్యార్థులు, యువత ప్రతి దానికి గూగుల్ మీద ఆధారపడుతున్నారని, కానీ వారు దీనిని పక్కన పెట్టి బుర్రకు పని చెప్పాలని సూచించారు.

## ఈ నెల 26 నుంచి జనసేన ఉద్యమి సభ్యత్వాలు..

- మొదటి పేజి తరువాయి
ఈ నెల 26న ప్రారంభం కానుంది. ఈ ప్రణాళికపై పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన జనసేన అగ్రనేత, మంత్రి నాదెండ్ల మనోహర్... క్షేత్రస్థాయిలో భారీగా సభ్యత్వాలు చేయించాలని సూచించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రెండు వారాల సమయాన్ని వినియోగించుకుని సమష్టిగా భారీగా సభ్యత్వాలను చేయించేలా లక్ష్యాలు పెట్టుకోవాలని అన్నారు. పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించనున్నట్టు తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలు సేకరించి స్పష్టమైన నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. స్థానిక సమస్యల పరిష్కారంలో చొరవ చూపితే పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని చెప్పారు. జెన్ జీని పార్టీకి దగ్గర చేయాలని... కొత్త సభ్యుల చేరికపై దృష్టి పెట్టాలని సూచించారు. గతంలో 12.6 లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయని... ఈసారి రెట్టింపు సభ్యత్వాలు లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు.

## వైసీపీని, జగన్ ను హిందువులకు దూరం చేసే కుట్ర జరుగుతోంది

తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అసత్యాలు ప్రచారం చేశారని, రాష్ట్రానికి పెద్దగా, బాధ్యతగా ఉండాల్సిన వ్యక్తి స్థానానికి ఇది తగదని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని రాజకీయాలకు వాడుకోవడం దుర్మార్గమని అన్నారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. లడ్డూ తయారీకి వినియోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు లేదని సీబీఐ సిట్ చార్జ్ షీట్ లో తెలిపిందని విష్ణు అన్నారు. తప్పుడు ప్రచారం చేసినందుకు కూటమి నేతలు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీని, జగన్ ను హిందువులకు దూరం చేసేందుకు కుట్ర పన్నారని... సీబీఐ రిపోర్టు వచ్చినా జగన్ పై బురద చల్లడం మానుకోలేదని దుయ్యబట్టారు. నెయ్యి వ్యవహారంపై కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ ప్రభుత్వ కనుసన్నల్లోనే ఉంటుందని... వారికి తగ్గట్టుగానే రిపోర్టు ఇస్తుందని అన్నారు. శాసనమండలిలో ఇందాపూర్, భోలేబాబా, హెరిటేజ్‌పై చర్చకు వైసీపీ తీర్మానం ఇచ్చినా కూటమి ప్రభుత్వం ఎందుకు తోక ముడిచిందో సమాధానం చెప్పాలని విష్ణు డిమాండ్ చేశారు. జంతువుల కొవ్వు, బాత్ రూమ్ కెమికల్స్ కలిపారని ఏ ఆధారాలతో మాట్లాడారో చెప్పాలని అన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారో కూడా వివరణ ఇవ్వాలని అడిగారు.

## కాంగ్రెస్ కార్యకర్తల నిరసన దిగ్భ్రాంతి కలిగించింది

- మొదటి పేజి తరువాయి
భారత్ శక్తిని ప్రపంచానికి చాటేందుకు ఉద్దేశించిన సదస్సులో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు.ఈ మేరకు లోకేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఏఐ సూపర్ పవర్‌గా భారత్ ఎదుగుతున్న తీరును ప్రదర్శించేం దుకు ఈ సదస్సు ఒక గొప్ప అవకాశం. అలాంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ కార్యక్రమాన్ని రాజకీయ వేదికగా మార్చడం ద్వారా ప్రపంచం ముందు మనందరి ప్రతిష్ఠను తగ్గించారు. ఇది దిగ్భ్రాంతికరం, విచారకరం" అని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.

భారతదేశం ఇంతకంటే మెరుగైన గౌరవానికి అర్హమైనదని ఆయన అభిప్రాయపడ్డారు. "మనం ఇలాంటి చిల్లర రాజకీయాలను పక్కనపెట్టి, ఆవిష్కరణలు, నైపుణ్యం ద్వారా దేశ నిర్మాణానికి ప్రాధాన్యత ఇద్దాం" అని లోకేశ్ పిలుపునిచ్చారు. దేశ ప్రతిష్ఠకు సంబంధించిన విషయాల్లో రాజకీయాలు చేయడం తగదని ఆయన హితవు పలికారు.

## కొండాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్.. రూ.1,400 కోట్ల విలువైన భూమికి రక్షణ

హైదరాబాద్ నగర శివారులోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన కొండాపూర్‌లో కబ్జాకు గురైన సుమారు 7 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.1,400 కోట్లు ఉంటుందని అంచనా. అధికారులు ఆక్రమణలను తొలగించి, శనివారం ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ బోర్డులను సైతం ఏర్పాటు చేశారు.

వివరాల్లోకి వెళితే, రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లోని సర్వే నంబర్ 78 నుంచి 93 పరిధిలో రాజరాజేశ్వరి నగర్ కాలనీ పేరుతో 1993లో గ్రామపంచాయతీ లేఅవుట్ వేశారు. ఈ లేఅవుట్‌లో ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 5 ఎకరాలు, పాఠశాలకు ఒక ఎకరా, పార్కులకు ఎకరాకు పైగా, కమ్యూనిటీ హాల్ కోసం 2181 గజాల స్థలాన్ని కేటాయించారు. అయితే, కాలక్రమేణా ఈ విలువైన స్థలాలు కబ్జాకు గురయ్యాయి. పాఠశాల స్థలంలో అపార్ట్‌మెంట్, కమ్యూనిటీ హాల్ స్థలంలో ప్రైవేటు దుకాణాలు, షెడ్లు వెలిశాయి.ఈ ఆక్రమణల వెనుక బడాబాబులు ఉన్నారని, ప్రజావసరాల కోసం కేటాయించిన భూములను కాపాడాలని రాజరాజేశ్వరి నగర్ కాలనీ సంక్షేమ సంఘం హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. లేఅవుట్‌లోని ప్లాట్లు ఎల్ఆర్ఎస్ అయినప్పుడు, పార్కులు, ప్రజావసరాల స్థలాలు ఎలా ఆక్రమణదారుల సొంతమవుతాయని వారు ప్రశ్నించారు.

ఈ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెంటనే స్పందించి, అధికారులను క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశించారు. లేఅవుట్ ప్రకారం ఆ భూములు ప్రజావసరాలకు చెందినవేనని నిర్ధారించుకున్న అధికారులు, వెంటనే ఆక్రమణలను తొలగించి, భూమి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని తమ సమస్యకు హైడ్రా పరిష్కారం చూపడంతో రాజరాజేశ్వరి నగర్‌లోని సుమారు 5 వేల కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. తమకు అండగా నిలిచిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపాయి.

## పరీక్షలు ఉన్నాయని ఆందోళన వద్దు

తెలంగాణలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈ నెల 25వ తేదీ నుంచి జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విద్యార్థులకు సూచనలు చేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా, పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షల్లో ఆందోళనకు గురికాకుండా ఎంత వస్తే అంత రాయాలని సూచించారు. ఫలితాల కోసం ఏమాత్రం ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. పరీక్షలు బాగా రాయలేనేమోననే ఆందోళనతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు వార్త చూశానని, కాబట్టి ఫలితాల గురించి భయపడవద్దని అన్నారు. పరీక్షలు అనేవి జీవితంలో చిన్న పందెమని గుర్తుంచుకోవాలని సూచించారు.ఒక పరీక్ష సరిగ్గా రాయకుంటే మన జీవితం అంతటితో ఆగిపోదని అన్నారు. పరీక్షల తర్వాత ఎంతో జీవితం ఉందని వ్యాఖ్యానించారు. పరీక్షల భయంతో ఏదైనా చేసుకుంటే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎంత క్షోభిస్తారో గుర్తుంచుకోవాలని అన్నారు. పరీక్షల వంటి చిన్న చిన్న అంశాలను దాటుకుంటూ వెళితే జీవితంలో పెద్ద పెద్ద వాటిని సులభంగా ఎదుర్కోవచ్చని అన్నారు.

## భారతీయులే లక్ష్యంగా జైషే మహమ్మద్ భారీ కుట్ర

పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ (జీవవీ) ఉగ్రవాద సంస్థ భారతీయులే లక్ష్యంగా ఒక భారీ అంతర్జాతీయ కుట్రకు తెరలేపింది. ప్రపంచవ్యాప్తంగా భారతీయులు యాజమానులుగా ఉన్న నైట్‌క్లబ్బులు, పబ్‌లు, బార్లలో దాడులు చేసేందుకు యువతులను నియమించుకుంటోంది. ఈ సంచలన విషయాన్ని భారత నిఘా వర్గాలు పసిగట్టాయి.జైషే తన మహిళా విభాగాన్ని ఈ ఆపరేషన్ కోసం ప్రత్యేకంగా రంగంలోకి దించింది. అందంగా ఉన్న యువతులను ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇస్తున్నారు. అనంతరం వీరిని ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో భారతీయులు నిర్వహిస్తున్న క్లబ్బులలో ఉద్యోగాల్లో చేర్పిస్తారు. అక్కడ పనిచేస్తూ, ఆ ప్రదేశంపై పూర్తి సమాచారం (రెక్కీ) సేకరించడం వీరి ప్రాథమిక విధి అని ఓ అధికారి తెలిపారు. రెక్కీ పూర్తయిన తర్వాత, అదే మహిళలతో దాడులు చేయించాలని జైషే ప్లాన్ చేస్తోంది. ప్రస్తుతం అమెరికా, యూకే, థాయ్‌లాండ్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, దుబాయ్ వంటి దేశాల్లోని లక్ష్యాలను గుర్తిస్తున్నట్లు సమాచారం.

ఈ కుట్రలో పాకిస్థాన్ ప్రమేయం బయటపడకుండా ఉండేందుకు, పాకిస్థానీ మహిళలను తక్కువ సంఖ్యలో వాడుకుని, ఉజ్బెకిస్థాన్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాల నుంచి ఎక్కువ మందిని రిక్రూట్ చేసుకుంటున్నారు. ఐఎస్ఐ సహకారంతో వీరికి నకిలీ గుర్తింపు పత్రాలు సృష్టించి ఉద్యోగాల్లో చేర్పిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి ఒకరు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తించిన అన్ని ప్రదేశాల్లో ఏకకాలంలో దాడులు జరిపి సంచలనం సృష్టించాలని జైషే భావిస్తోంది.ఈ భారీ ఆపరేషన్ కోసం పెద్ద ఎత్తున నిధులు అవసరం కావడంతో, 'గాజా సహాయం' పేరుతో పాకిస్థాన్, గల్ఫ్ దేశాల్లో గత నాలుగు నెలలుగా విరాళాలు సేకరిస్తోంది. వ్యక్తిగత నష్టాలు, వేధింపులకు గురైన చరిత్ర ఉన్న మహిళలనే జైషే ఎక్కువగా లక్ష్యం చేసుకుంటోంది. ఇలాంటి వారు సులభంగా ఆత్మాహుతి దళ సభ్యులుగా మారతారని, వారిపై అనుమానం కూడా రాదని ఉగ్రవాద నిరోధక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ అంతర్జాతీయ కుట్రపై భారత ఏజెన్సీలు అప్రమత్తంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయి.

## ఏపీ లిక్కర్ కేసులో కీలక మలుపు.. వాసుదేవరెడ్డి అరెస్ట్

- మొదటి పేజి తరువాయి
ఐఆర్టీఎస్ అధికారి వాసుదేవరెడ్డిని సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. వైసీపీ హయాంలో జరిగిన మద్యం స్కాంకు సంబంధించి విజయవాడలోని ఏపీబీసీఎల్ కార్యాలయం నుంచి ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, కీలక పత్రాలను చోరీ చేశారంటూ ఆయనపై ఫిర్యాదు అందింది. ఈ క్రమంలో ఆయనపై ఆధారాల ధ్వంసం, చోరీ, నేరపూరిత కుట్ర అభియోగాలతో 2024 జూన్‌లో కేసు నమోదు అయింది. ఈ కేసులో ఆయన ఏ2గా ఉన్నారు.హైదరాబాద్‌లోని తన నివాసంలో సీఐడీ సోదాలకు వెళ్లిన సమయంలో వాసుదేవరెడ్డి పరారయ్యారు. అప్పటి నుంచి అజ్ఞాతంలో ఉండగా... తాజాగా సీఐడీ పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు.

## నక్సల్స్ ను ఏరివేసినట్లే చొరబాటుదారులను కూడా ఏరివేయడం సాధ్యమే

- మొదటి పేజి తరువాయి
కాబట్టి వారిని దేశం నుంచే పంపించివేయాలని అన్నారు. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని గతంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ చెప్పారని గుర్తుచేశారు. వారు చెప్పిన మాటలు విశ్వసించవద్దని, ఎందుకంటే వారికి చొరబాటుదారులే ఓటు బ్యాంకు కాబట్టి వారిని పంపించలేరని అన్నారు.చొరబాటుదారులను రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు అసోంకు ముప్పుగా పరిణమించాయని విమర్శించారు. ఒకవేళ వారిపై చర్యలు తీసుకునే విషయానికి వస్తే కాంగ్రెస్ కట్టుబడి ఉంటే పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపర్చాలని డిమాండ్ చేశారు. వచ్చే ఐదేళ్ల కాలంలో అసోంను పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు.

## మన స్నేహాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటా

- మొదటి పేజి తరువాయి
ఎక్స్ వేదికగా భావోద్వేగంతో కూడిన పోస్టును పెట్టారు. మన స్నేహాన్ని, జ్ఞాపకాలను ఎప్పటికీ గుర్తుంచుకుంటానని తెలిపారు. ఒక స్నేహితుడిగా, సోదరుడిగా ఎప్పటికీ గుర్తుండిపోతావని ట్వీట్ లో పేర్కొన్నారు. గౌతమ్ రెడ్డితో జగన్ ఎంతో సన్నిహితంగా ఉండేవారనే విషయం తెలిసిందే.

2022 ఫిబ్రవరి 21న గౌతమ్ రెడ్డి మృతి చెందారు. గుండెపోటుకు గురైన ఆయన హైదరాబాద్ లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఐసీయూలో దాదాపు 90 నిమిషాల పాటు వైద్యులు అత్యవసర చికిత్సలు చేసినప్పటికీ ఆయన ప్రాణాలు దక్కలేదు.

# దేవుళ్ళ పేరుతో ఆటలాడొద్దు జగన్

- ఈసారి ఆ 11 సీట్లు కూడా రావు
- వైసిపి రాజకీయంపై ఎమ్మెల్యే ఇంటూరి ఆగ్రహం
- వైసిపి హయాంలో 300 పైగా ఆలయాలపై దాడులు
- ఎన్నికల ప్రచారంలో శ్రీవారి లడ్డూలను పంచింది మీరుకాదా ?
- హిందూ సంస్కృతిని అవమానిస్తే ప్రజలు ఊరుకోరు
- కల్తీనెయ్యితో భక్తుల మనోభావాలు దెబ్బతీశారని ఆగ్రహం
- ఇప్పటికైనా తిరుమలవెళ్లి లెంపలేసుకుని క్షమాపణ కోరండి
- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 21:**

జగన్మోహన్ రెడ్డికి, వైసీపీ నేతలకు దేవుడంటే భక్తి, భయం లేవు గడిచిన 5 ఏళ్లలో జగన్ రెడ్డి హిందూ మతం, సంస్కృతి పై విషం కక్కాడు, 300కు పైగా ఆలయాల పై దాడులు జరిగాయి అని స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. శనివారం తన కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామతీర్థంలో శ్రీరాముల వారి విగ్రహం తల వేరుచేశారు. అంతర్వేదిలో స్వామివారి రథాన్ని తగలబెట్టారు అని అన్నారు. తిరుమలను రాజకీయాలకు వాడుకున్న దుర్మార్గుడు జగన్మోహన్ రెడ్డి, వెంకటేశ్వర స్వామిని దర్శించడానికి వెళ్ళినప్పుడు డిక్లరేషన్ పై సంతకం చేయమంటే చేయరు ఎందుకని ప్రశ్నించారు. మాడవీధుల్లో చెప్పులేసుకుని తిరిగారు, గత ఎన్నికల ప్రచారంలో శ్రీవారిలడ్డు ప్రసాదాన్ని ఓటర్లకు పంచిపెట్టారు. వై వి సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ద్వారా తిరుమల ఆలయ పవిత్రతను దెబ్బతీస్తే హిందువుల మనసులు ఎంతో గాయపడ్డాయి అని అన్నారు. చివరకు వీఐపీ బ్రేక్, సేవా టికెట్లు, ప్రసాదాలు అమ్ముకున్న దుర్మార్గులు వాళ్లు అన్యమతస్తులను కూడా ఉద్యోగాల్లో చేర్పించిన ఘనత వైసిపి ప్రభుత్వానిది అని విమర్శించారు. అన్నిటికీ మించి కల్తీ నెయ్యితో లడ్డు ప్రసాదాన్ని అపవిత్రం చేయడం పరమ దుర్మార్గం, దర్యాప్తులో వైసిపి నేతల ప్రమేయం తేలినా, ఇప్పటికీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు అని అన్నారు. అసెంబ్లీలో కూడా చెప్పులు వేసుకుని దేవుడు పటాలు పట్టుకున్నారు, స్వామివారికి దంపతులు వెళ్లి పట్టు వస్త్రాలు సమర్పించే ఆచారాన్ని పాటించకుండా, జగన్ ఒక్కడే వెళ్లడం ఏమిటి ? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా మించి పోయింది లేదు. జగన్మోహన్ రెడ్డి బుద్ధి తెచ్చుకుని, తిరుమల వెళ్లి లెంపలేసుకుని క్షమాపణ కోరాలి అని అన్నారు. లేకపోతే ఈసారి ఆ 11 సీట్లు కూడా మిగలవని గుర్తుంచుకోండి అని అన్నారు. కూటమి ప్రభుత్వం ఫ్రెండ్లీ ప్రభుత్వం, గతంలో ఎమ్మెల్యేలు, మంత్రులకు జగన్మోహన్ రెడ్డి కనీసం అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం చూశాం, మా యువ నాయకుడు లోకేష్ చూడండి... మా కుటుంబాలతో ఎంత ఆత్మీయంగా ఉంటున్నాడో ! ఎంత బాగా మాట్లాడుతున్నాడో !. గతంలో జగన్ దగ్గరికి ఎమ్మెల్యేలు వెళితే ఎంత తెచ్చావు అని అడిగేవారు అని, ఇప్పుడు మేం వెళితే ఏ అభివృద్ధికి, ఎంత నిధులు కావాలి అని అడిగిమరీ ఇస్తున్నారు అని తెలిపారు. చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి వైపు స్పీడ్ గా వెళుతోంది, దేశంలో వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం మన రాష్ట్రానికి వస్తున్నాయి అని అన్నారు. రాజధాని అమరావతిలో వేలాది మంది కార్మికులు మిషన్లు రాత్రింబవళ్లు పనిచేస్తున్నాయి, పోలవరం పనులు స్పీడ్ గా జరుగుతున్నాయి అని అన్నారు. మరోవైపు వైజాగ్ ఐటీ హబ్ గా దూసుకుపోతోంది. తిరుమలతో పాటు అన్ని ఆలయాల నిర్వహణ చక్కగా ఉంది, బటన్లు నొక్కే జగన్మోహన్ రెడ్డిని వద్దనుకుని, అభివృద్ధి చేసే చంద్రబాబు నాయుడు పాలనను మరోసారి ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఈ సమావేశంలో నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రూరల్ అధ్యక్షుడు బస్సారెడ్డి కృష్ణారెడ్డి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

## క్రమశిక్షణ.. దానగుణం..

# భక్తికి ప్రతీక రంజాన్ మాసం

### ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు

### టీం పెన్ పవర్ ఒంగోలు -రంజాన్ మాసం ఉపవాసం కేలండర్ ఆవిష్కరణ







**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ ఫిబ్రవరి 21**

క్రమశిక్షణ, దానగుణం, భక్తికి ప్రతీక ఈ రంజాన్ మాసం అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు పేర్కొన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా టీం పెన్ పవర్ ఒంగోలు, రాష్ట్ర టిడిపి మైనారిటీ సెల్ నాయకులు పఠాన్ హనీఫ్ ఖాన్ ఆధ్వర్యంలో వేరు వేరుగా ప్రచురించిన రంజాన్ మాసం ఉపవాసం కేలండర్ లను శనివారం ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ ముస్లిం సోదరులందరూ ఈ పవిత్ర మాసంలో ఉపవాస దీక్షలను భక్తిశ్రద్ధలతో పాటించి, అల్లాహ్ దీవెనలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.మన రాష్ట్రంలో సర్వమత సామరస్యం వెల్లివిరియాలని, ప్రతి ఇంటా రంజాన్ శుభ వెలుగులు నిండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పఠాన్ హనీఫ్ ఖాన్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, నగర టిడిపి అధ్యక్షులు బండారు మదన్, టిడిపి నాయకులు టీవీ శ్రీరామ్ మూర్తి, గుంటూరు రాంబాబు, కామరాజుగడ్డ కుసుమ కుమారి, పెద్ది శెట్టి వరలక్ష్మి, బొడ్డపాటి వెంకట్, షేక్ సిలార్, మహమ్మద్ ఖాన్, అహ్మద్ ఖాన్, అక్బర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి భరోసా... ముఖ్యమంత్రి సహాయనిధి

### - రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 21**

అనారోగ్య కారణాల వల్ల ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్వామి తెలిపారు. శనివారం తూర్పు నాయుడుపాలెంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేద ప్రజలు ఆరోగ్య సమస్యల వల్ల ఆర్థికంగా చితికిపోకూడదని, ప్రభుత్వం వారికి ఆర్థికంగా అండగా నిలుస్తుందన్నారు. శనివారం కొండేపి నియోజకవర్గంలో 58 మందికి 31 లక్షల 53 వేల 987 రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు ఇచ్చామని,ఇప్పటి వరకు మొత్తం 1524 మందికి 12 కోట్ల 2 లక్షల 56 వేల రూపాయలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో కొండేపి నియోజకవర్గానికి సహకారం అందించిన ముఖ్యమంత్రి కి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. వైద్యానికి ఖర్చు పెట్టీ కుటుంబాలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 25 లక్షల తో వైద్య బీమా సదుపాయాన్ని తీసుకొస్తున్నట్లు ఆయన చెప్పారు. బిల్ గేట్స్ సహకారం తో సంజీవిని పథకాన్ని ప్రారంభించబోతున్నామని అన్నారు. ఈ ప్రాజెక్టులో ప్రజలందరి ఆరోగ్య రికార్డ్స్ ఆన్లైన్ చేస్తామన్నారు. దీని ద్వారా వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు గుర్తించి వైద్యం చేసి ప్రాణాలు కాపాడే విధంగా ఈ సంజీవిని పథకం ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటికే కుప్పంలో 60 వేల మందికి ఈ పథకం అమలు చేసినట్లు మంత్రి తెలిపారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకాన్ని అమలుచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం ఆనందంగా ఉంటుందన్నారు.

**చెమ్మగిల్లిన మంత్రి కళ్ళు**

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ సమయంలో కొండేపి కి చెందిన భాస్కరుని శేషమ్మ కన్నీరుమున్నీరు అయ్యారు. తన భర్త భాస్కరుని సుబ్బారావు 5 నెలల క్రితం ఆసుపత్రిలో వైద్యం పొందుతూ మరణించడం జరిగిందనీ అప్పటి నుండి తన కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతుందని ఇప్పుడు మీ సహకారం తో ముఖ్యమంత్రి సహాయనిధి రావటం కుటుంబానికి కొంత ఉపశమనం కలిగిస్తుందని ఆమె చెప్పటంతో మంత్రి కళ్ళు చెమ్మగిల్లాయి. ఈ సంఘటన ప్రత్యక్షంగా చూసిన అక్కడున్న ప్రజలు ఇంత మంచి మంత్రి తమ నియోజకవర్గానికి ఉండటం తమ అదృష్టమని చెప్పారు.

# ఇంటర్మీడియేట్ పరీక్షలకు పటిష్ట బందోబస్త్ ఏర్పాటు

### - ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు

### - పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు... జిరాక్స్ సెంటర్లు మూసివేత



**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 21**

ఈ నెల 23 నుంచి మార్చి 24 వరకు ప్రతీ రోజు ఉదయం 9 నుండి మధ్యాహ్నం12 గంటల వరకు నిర్వహించు ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా జరిగేలా పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు తెలియజేశారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుందని తెలిపారు. పరీక్షా పత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ ల వద్ద ఆర్మ్డ్ గార్డులను పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, పరీక్ష పేపర్లు కేంద్రాలకు తీసుకొచ్చేటప్పుడు, సమాధాన పత్రాలు తీసుకెళ్లేటప్పుడు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున పరీక్షా కేంద్రాలు ఆవరణలో బయట వ్యక్తులు లేకుండా చర్యలు తీసుకున్నామని, పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయిస్తున్నామని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు మరియు డ్రోన్ కెమెరాలు నిఘా ఉంటుందని తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా 79 కేంద్రాలలో ఇంటర్ పరీక్షలు జరుగుతాయని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కేంద్రాలలో అవసరమైన వరకు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని, ఎలాంటి అవకతవకలు, మాల్ ప్రాక్టీసుకు అవకాశం లేకుండా పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని పోలీస్ అధికారులకు ఎస్పీ ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షలను సజావుగా ప్రశాంత వాతావరణ నిర్వహించేందుకు ఇతర శాఖల సమయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేసామని, ప్రత్యేక మొబైల్ పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేసామని, పరీక్షలు జరుగు సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్లు నిరంతరం తిరుగుతూ ఉంటాయని, పరీక్షా సమయంలో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. విద్యార్థులు ఉదయం 9 గంటలు దాటితే పరీక్ష కేంద్రంలోనికి అనుమతించబోరని, కావున దయచేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి సరైన సమయంలో పరీక్షా కేంద్రానికి చేరుకునేలా చూడాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులతో పాటు పరీక్షా కేంద్రం వద్ద విధులు నిర్వహించే అన్ని శాఖల సిబ్బంది కూడా ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతి లేదన్నారు. చిట్టీలు, పుస్తకాలు పెట్టి మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ కు విద్యార్థులు ఎవరైనా పాల్పడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఏ పరీక్షా కేంద్రం వద్ద అయినా ఎటువంటి చిన్న ఘటన జరిగిన వెంటనే డయల్ 100/112 లేదా జిల్లా పోలీస్ వాట్సాప్ 9121102266 కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ తెలియజేసారు.

# పట్టణాన్ని, గ్రామాన్ని శుభ్రంగా ఉంచుకోవటం ప్రతి పౌరుడి బాధ్యత!

**చెత్తను ఎక్కడబడితే అక్కడవేయరాదు**

**చెత్త చెత్త బుట్టలో నే వేయాలి**

**ఇండ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను ఎరువుగా మార్చుకొని పెరటి తోటలను పెంచవచ్చు**

**వీధులు పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం**

**పరిశుభ్రతపై ప్రభుత్వం ఎన్నో అవగహన సదస్సులు నిర్వహిస్తోంది**




**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 21**

గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో కమిషనర్ ఈవి రమణబాబు , అర్బన్ సీఐ సురేష్ ఆద్వర్యం లో సంయుక్తంగా మున్సిపల్ సిబ్బంది, పోలీసులు కలిసి స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ రమణ బాబు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో అయిన గ్రామాలోనైనా మన వీధులు పరిసరాలు శుభ్రం గా ఉంచుకోవడం ప్రతి పౌరుని భాద్యత అని తెలిపారు. మనపరిసరాలు శుభ్రం గా ఉంటేనే మన ఆరోగ్యానికి భద్రత అన్నారు. చెత్తను ఎక్కడ బడితే అక్కడ వేయరాదని, చెత్త బుట్టలు ఏర్పాటుచేసుకొని అందులో వేసి పారిశుధ్యం కార్మికులు మీఇంటి వద్దకు వసచ్చినప్పుడు అందజేయాలన్నారు. భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు, కాలువలు, చెత్త పేరుకుపోయిన ప్రదేశాలను శుభ్రపరిచారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్త బుట్టల్లో వేయాలని, లేదా ఆ చెత్తను ఎరువుగా మార్చుకొని పెరటి తోటల్లో ఎరువుగావేసుకోని పెరటి తోటలను పెంచుకోవచ్చని తెలిపారు. సైడ్ కాలువల్లో చెత్త వేయవద్దని అలా వేయటం వలన మురుగు ప్రవాహానికి ఆటంకం ఏర్పడి దోమల ఉత్పత్తి అయి మన అరోగ్యాలకు హాని కలిగే ప్రమాదం ఉందన్నారు. చెత్త రహిత సమాజం కోసం ప్రభుత్వం ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు చెత్తరహిత సమాజమే మన లక్ష్యం కావాలని సూచించారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణాన్ని స్వచ్ఛంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. అధికారులు--ప్రజలు సమన్వయంతో పనిచేస్తే పట్టణం పరిశుభ్రంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, పోలీసులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రమణబాబు, ఏఎస్ఐ జిలాని స్వర్ణ వార్డు శానిటేషన్ సిబ్బంది పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నృసింహుని ఆదాయం రూ 8,79,578

**వలేటివారిపాలెం,పెన్ పవర్ ఫిబ్రవరి 21**

మాలకొండ లో వెలిసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మి నరసింహస్వామి వారికి శనివారం భక్తుల నుండి వివిధ రూపాల ద్వారా రూ. 8,79578 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకులు గౌరి శంకర్ నృసింహా చార్యులు స్వామివారిని అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి హానికరం

### ఎలక్ట్రానిక్ వ్యర్థాలు ప్రత్యేక కేంద్రంలో అప్పగించి రీసైకిల్ చేయాలి

### శుభ్రమైన గిద్దలూరు మనందరి భాద్యత

### స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర

### కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల





**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 21**

గిద్దలూరు పట్టణంలోనీ గిద్దలూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో "స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం నిర్వహించారు. గిద్దలూరు పట్టణాన్ని శుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన "స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, ఈ-వ్యర్థాలు అయిన పాత మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, బ్యాటరీలు, చార్జర్లు, వైర్లు వంటి వస్తువులను సాధారణ చెత్తలో కలపకూడదని, రోడ్లపై పడవేయకూడదని ప్రజలకు హితవుపలికారు. ఇలాంటి ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి, భూగర్భ జలాలు మన ఆరోగ్యానికి హానికరమని తెలిపారు. ప్రత్యేక సేకరణ కేంద్రాలకు అందజేసి సక్రమంగా రీసైకిల్ చేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. శుభ్రమైన గిద్దలూరు - మన అందరి బాధ్యత" అనే నినాదంతో ప్రతి ఇంటి నుంచీ సహకారం అందించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య , మున్సిపల్ కమిషనర్ ఈ వి రమణ బాబు , మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య ,, పట్టణ అధ్యక్షుడు షేక్ షెహన్ షా వలి, పట్టణ కౌన్సిలర్ లు, వార్డు నాయకులు,అభిమానులు,పురపాలక అధికారులు , సిబ్బంది పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చెర్లోపాలెం వద్ద రోడ్డుప్రమాదం

### –బాధితులకు ఎమ్మెల్యే ఇంటూరి పరామర్శ





**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 21**

కందుకూరు సమీపంలోని చెర్లోపాలెం వద్ద ఈ మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి, రోడ్డు మార్జిన్ లోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. నెల్లూరుకు చెందిన దంపతులు, పిసిపల్లి మండలం పెదఇర్లపాడు గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లి, తిరిగి నెల్లూరు వెళు తున్నారు. చెర్లోపాలెం సమీపంలో కారు అదుపుతప్పి, రోడ్డు పక్కనున్న వెంకట్ ఫుడ్ కోర్ట్ సమీపంలోకి దూసుకెళ్లింది. దంపతులిద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇదే సమయంలో అటుగా వెళుతున్న కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. దంపతులను పరామర్శించి యోగక్షేమాలు కనుక్కున్నారు. అనంతరం వారిని అంబులెన్స్ లో ఆసుపత్రికి పంపించారు.

## రామకృష్ణాపురంకు త్రాగునీటి పైపులైను వెంటనే పునరుద్దరించాలి



**ఉలవపాడు పెన్ పవర్, ఫిబ్రవరి 21**

పగలగొట్టిన పైపులైను వెంటనే పునరుద్దరించి రామకృష్ణాపురం గ్రామ ప్రజలకు త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జి బుర్రా మధు సూధన్ యాదవ్ ఒక ప్రకటనలో తెలియపరిచారు. బిపిసిఎల్ సిబ్బంది తమ పనుల కోసం కరేడు నుండి రామకృష్ణాపురం కు వెళ్ళే త్రాగునీటి పైపులైను ద్వసం చేశారు. దీనివలన రామకృష్ణాపురం ప్రజలు గత పది రోజుల నుండి త్రాగునీటికి తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పంచాయితీలో ఫిర్యాదు చేసినా వారు ఇంతవరకు బిపిసియల్ సిబ్బందిపై చర్యలు తీసుకోలేదు. వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకొని పైపు లైను వెంటనె పునరుద్దరించాలని బుర్రా మధు సూధన్ యాదవ్ కోరారు.

## గ్రూప్-1 అభ్యర్థులకు ఘన సన్మానం

### ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి





**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఫిబ్రవరి 21**

మార్కాపురం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో ఇటీవల గ్రూప్ -1 కి సెలెక్ట్ అయిన అభ్యర్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యాపరంగా, ఉద్యోగాల పరంగా గతంలో ఈ ప్రాంతం పూర్తిగా వెనుకబడి ఉండేదని కానీ ఈ ప్రాంతం నుండి గ్రూప్ -1 అభ్యర్థులుగా ఎంపికైన వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. నూతనంగా ఏర్పడిన మన మార్కాపురం జిల్లాలో త్వరలోనే మంచి విద్యా సంస్థలు ఏర్పాటు జరుగుతున్నది అని తద్వారా ఈ ప్రాంత యువకులు భవిష్యత్తులో పెద్ద ఎత్తున ప్రభుత్వ ఉద్యోగంలలో ఐఏఎస్, ఐపీఎస్ ఐఆర్ఎస్ గ్రూపు-1 ఉద్యోగాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో మార్కాపురం పట్టణం లో మంచి లైబ్రరీ ఏర్పాటు చేయబోతున్నామని దానికి తన వంతు గా అన్ని రకాల సహాయం చేస్తానని అన్నారు. అదేవిధంగా గ్రూప్-1 కి సెలెక్ట్ అయిన అభ్యర్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు , ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ. వి. సుబ్బారావు, జిల్లా అధ్యక్షులు రమణ, సిపిఐ నాయకులు అందె నాసరయ్య మీడియా ప్రముఖులు పాల్గొన్నారు.

# అధికారులూ..విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు వారధులు

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 21**

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు వారధులుగా నిలవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా. శ్రీ బాల వీరాంజనేయ స్వామి చెప్పారు. శనివారం టి. నాయుడుపాలెం లో ఉమ్మడి ప్రకాశం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖలో గ్రేడ్-2 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లుగా పనిచేస్తూ గ్రేడ్-1 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ గా పదోన్నతి పొందిన 8 మందికి పదోన్నతా ఉత్తర్వులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పదోన్నతి పొందిన వారందరికీ అభినందనలు తెలుపుతూ, వారితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మంత్రి కీలక సూచనలు చేశారు. పదోన్నతి అంటే కేవలం హోదా పెరగడం కాదు, బాధ్యత పెరగడం. సాంఘిక సంక్షేమ శాఖకు మీ పనితీరు ద్వారా మంచి పేరు తీసుకురావాలని సూచించారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు మీరే తల్లిదండ్రులు. వారి చదువు, ఆరోగ్యం, మెనూ విషయంలో ఎక్కడా రాజీ పడకూడదన్నారు. కన్నబిడ్డల వలె వారి పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. పేదరికం కారణంగా హాస్టళ్లలో ఉండి చదువుకునే పిల్లలు రేపటి సమాజానికి



ఆదర్శంగా నిలవాలని,వారి వ్యక్తిత్వ వికాసం కోసం మీరు నిరంతరం కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకం క్షేత్రస్థాయిలో విద్యార్థులకు సక్రమంగా అందేలా చూడటమే మీ ప్రథమ కర్తవ్యం అని అన్నారు. బాలికల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ లు గా డి.దుర్గాలక్ష్మి (ఒంగోలు), కె.శ్రీలత (ఒంగోలు), కె స్వప్నలత (ఒంగోలు), ఎన్ అరుణ కుమారి (కొత్తపట్నం), బాలుర హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ లు గా సి.హెచ్.



శ్రీనివాసులు (గుడ్లూరు), ఎన్ .ప్రభుదాస్ బి. (బి నిడమానూరు), జె సుమన్ శాస్త్రి (కేవీ పల్లి), ఎం. హరిబాబు(పొదిలి ). ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. లక్ష్మా నాయక్, ఏఎస్డబ్ల్యూఓ కందుకూరు లింగయ్య, ప్రకాశం జిల్లా హెచ్.డబ్ల్యూ.ఓ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ డి. అంకబాబు, ఆఫీస్ సూపరింటెండెంట్ మాల్యాద్రి, సీనియర్ అసిస్టెంట్ మాలకొండయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## వర్గ పోరాటం ద్వారానే సామ్రాజ్యవాదాన్ని ఎదిరించగలం

### - రెడ్ బుక్స్ డే సందర్భంగా స్టడీ సర్కిల్‌లో వక్తల పిలుపు



**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు ఫిబ్రవరి 21**

వర్గ పోరాటం ద్వారానే సామ్రాజ్యవాద దోపిడీ విధానాలను సమర్థంగా ఎదుర్కొనగలమని సిపిఎం నాయకులు స్పష్టం చేశారు. రెడ్ బుక్స్ డే పురస్కరించుకొని శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో సామ్రాజ్యవాదం అంశంపై స్టడీ సర్కిల్‌ను నిర్వహించారు. సిపిఎం ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ కె మాబు మాట్లాడారు. దేశంలో సామ్రాజ్యవాద విధానాలు మరింతగా విస్తరిస్తున్న తరుణంలో వాటికి వ్యతిరేకంగా పోరాటాన్ని క్రింది స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని పేర్కొన్నారు. సామ్రాజ్యవాదాన్ని ఎదిరించాలంటే సిద్ధాంతపరమైన స్పష్టతతో పాటు కార్యాచరణ అవసరమని అన్నారు. ప్రజల్లో అవగాహన పెంచే దిశగా పార్టీ శ్రేణులు చైతన్యవంతంగా పని చేయాలని పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను క్రింద దాకా తీసుకెళ్లాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. పాఠ్యాంశాన్ని బోధించిన సిపిఎం సీనియర్ నాయకులు వై సిద్దయ్య మాట్లాడుతూ, సామ్రాజ్యవాద ఆర్థిక విధానాలే ప్రపంచ పురోగమనానికి అడ్డంకని దాని వల్ల నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు తీవ్రరూపం దాల్చుతున్నాయని విశ్లేషించారు. కార్పొరేట్ ప్రయోజనాల కోసం ప్రజల వనరులు వినియోగించ బడుతున్నాయని, దీని ప్రభావం కార్మికులు, రైతులు, మధ్యతరగతి వర్గాలపై తీవ్రంగా పడుతోందన్నారు. సమసమాజ స్థాపన దిశగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని బలపర్చాలని సూచించారు. అధ్యక్షత వహించిన జివి కొండారెడ్డి మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ పాలక వర్గాలు ప్రజల సంపదను సామ్రాజ్యవాద శక్తులకు కట్టబెడుతున్నాయని ఆరోపించారు. ఈ దోపిడీ వ్యవస్థను ఎదుర్కొనాలంటే ప్రజా పోరాటాలను నిర్మించాలని, పార్టీ శ్రేణులు సిద్ధాంతపరమైన అధ్యయనం పెంచుకొని ప్రజల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర కమిటీ కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, జిల్లా కమిటి సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా 'స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమం



**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 21**

స్థానిక టీ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో శనివారం జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే ఈ పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా, కళాశాల ప్రాంగణాన్ని శు భ్రపరచడం విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రిన్సిపాల్ డా. ఎం. రవికుమార్ మాట్లాడుతూ,జీరో లిట్టర్ గవర్నెన్స్(చెత్త రహిత పరిపాలన) అనే ఇతివృత్తంతో ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత అనేది కేవలం ఒక రోజు చేసే పని కాదని, అది మన జీవనశైలిలో భాగం కావాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులు పరిశుభ్రతపై నినాదాలు చేస్తూ, ప్లకార్డులను ప్రదర్శిస్తూ కళాశాల ఆవరణలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ యూనిట్-1 కో-ఆర్డినేటర్ కె. నరేష్ రాజా, ఫిజికల్ డైరెక్టర్ కె. కరుణ రత్న కుమార్, వివిధ విభాగాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏ 1సమ్మిట్ లో కాంగ్రెస్ తీరు హేయకరం

### బీజేపీ నేత డాక్టర్ ఏలూరి విమర్శ

**పెద్ద దోర్నాల పెన్ పవర్ ఫిబ్రవరి 21**



దేశ రాజధాని ఢిల్లీలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఏఐ సమ్మిట్ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రవర్తించిన తీరుపై బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ సాంకేతిక రంగంలో భారత్ తన సత్తా చాటుతూ గ్లోబల్ స్థాయిలో గుర్తింపు పొందుతున్న ఈ కీలక సమయంలో కాంగ్రెస్ పార్టీ దీనిని జీర్ణించుకోలేక దుష్ప్రచారానికి పాల్పడుతోందని ఆయన విమర్శించారు. దేశ గౌరవం, ప్రతిష్ట కంటే కాంగ్రెస్ పార్టీకి రాజకీయలే ముఖ్యమని మండిపడ్డారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద జరుగుతున్న సమ్మిట్ వేదిక సమీపంలో చొక్కాలు విప్పి నిరసన వ్యక్తం చేయడం అత్యంత హేయమైన చర్య అని ఆయన పేర్కొన్నారు. ఈ చర్య ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్టను దిగజార్చే విధంగాను, ఉద్దేశపూర్వకంగా చేసిన కుట్రగా ఆయన అభివర్ణించారు. అంతర్జాతీయ స్థాయిలో భారత్ టెక్నాలజీ శక్తిగా ఎదుగుతున్న వేళ, ఇటువంటి సంఘటనలు దేశ ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉన్నాయని అన్నారు. భారత్ గ్లోబల్ టెక్ పవర్‌హౌస్‌గా ఎదగడానికి కృషి చేస్తుంటే, కాంగ్రెస్ పార్టీ ప్రవర్తన దేశ అభివృద్ధిని అడ్డుకోవాలనే భావనను ప్రతిబింబిస్తోందని విమర్శించారు. దేశం అభివృద్ధి చెందడాన్ని ఓర్వలేక, విదేశీ వేదికలపై కూడా దేశ ప్రతిష్టను దెబ్బతీసే చర్యలకు కాంగ్రెస్ పాల్పడుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ నిరసన తెలిపే హక్కు ఉన్నప్పటికీ, దేశ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ప్రవర్తించే హక్కు ఎవరికీ లేదని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. దేశ ప్రయోజనాలు, గౌరవం అన్నిటికంటే ముఖ్యమని, ఇటువంటి దిగజారుడు రాజకీయాలను ప్రజలు సహించరని బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ చర్యలను ఖండిస్తున్నాం

### అప్పిశెట్టి ఉదయ్ శంకర్

**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 21**




భారత ప్రధాని నరేంద్రమోడీ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ దాష్టికాన్ని గిద్దలూరు బిజెపి నాయకులు అప్పిశెట్టి ఉదయ శంకర్ తీవ్రంగా ఖండించారు. ఇండియా ఏ ఐ ఎక్సపో శుక్రవారం ఢిల్లీ లో కాంగ్రెస్ పార్టీ గుండాలు భారత మండపము పై దాడి చేసి దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మీద అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానపరచడం విచారకరం , కాంగ్రెస్ పార్టీ ఈ విధమైన దౌర్జన్య దుందుడుకు చర్యలకు ఆ పార్టీ రాహుల్ గాంధీ బాధ్యత వహించాలని అప్పిశెట్టి డిమాండ్ చేశారు. ఈ దేశ ప్రధాని నరేంద్ర మోడీ కి, బీజేపీ పార్టీ నాయకులకు బేష రత్తు గా క్షమాపణలు చెప్పి వారి వ్యాఖ్యలు ఉప సంహారించుకోవాలని కోరారు. అంతే కాకుండా బీజేపీ నాయకులు ఒక క్రమశిక్షణ కలిగిన నాయకుల పార్టీయని,దేశంలో సూపరిపాలన అందించే ప్రధానమంత్రి మీద ఇటువంటి చేయకూడని వ్యాఖ్యలు విచారకరం అన్నారు.

## ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

### కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో పరీక్షలు రాయనున్న 525 మంది ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థులు

**కొమరోలు పెన్ పవర్ ఫిబ్రవరి 21**



కొమరోలు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షా కేంద్రంలో ఈనెల 23వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని పరీక్షా కేంద్ర చీఫ్ సూపరిండెంట్ ఎస్ ప్రభాకర్ ,డిపార్ట్మెంట్ అధికారి కె.వి కిరణ్ కుమార్ తెలిపారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈనెల 23వ తేదీ నుండి ఏప్రిల్ 18 తేదీ వరకు జరుగనున్నాయి. అందులో భాగంగా కొమరోలు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆ పరీక్షా కేంద్రంలో కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు కొమరోలు లోని శ్రీ ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు, రాజుపాలెంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లోని ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై శనివారం కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ ప్రభాకర్ తో పెన్ పవర్ ప్రతినిధి సంప్రదించగా, తమ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో మొదటి సంవత్సరం విద్యార్థులు మొత్తం 280 మంది పరీక్షలు రాయనుండగా, వారిలో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు 94 మంది ఉన్నారని ప్రిన్సిపాల్ ప్రభాకర్ తెలిపారు .అలాగే రెండవ సంవత్సరం విద్యార్థులు మొత్తం 245 మంది పరీక్షలు రాయనుండగా వారిలో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు 89 మంది ఉన్నారని ఆయన తెలిపారు. కాగా పరీక్షా కేంద్రంలో 11 గదులను ఏర్పాటు చేశామని, తమ కళాశాలకు చెందిన నలుగురు అధ్యాపకులతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి నియమించిన మరో ఏడు మంది ఇన్విజిలేటర్లు పరీక్షల నిర్వహణ విధులలో పాల్గొంటారని ఆయన తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామని, విద్యార్థులు ఉదయం 8:30 లోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన చెప్పారు. పరీక్ష కేంద్రానికి డిపార్ట్మెంట్ అధికారిగా తురిమెల్ల జూనియర్ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకులు కేవీ కిరణ్ కుమార్ ను నియమించారని ఆయన వివరించారు. పరీక్ష గదులతో పాటు వరండా, ఆఫీసు రూమ్ లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు .పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం పరీక్ష కేంద్రంలో తాగునీటి సౌకర్యంతో పాటు కొమరోలు పిహెచ్సి మెడికల్ ఆఫీసర్ వి శాంతి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు కూడా ఏర్పాటు కు చర్యలు తీసుకున్నామని ,ఈనెల 23వ తేదీ నుంచి వచ్చేనే 18 తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షా కేంద్రం వెలుపల కొమరోలు ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన వివరించారు. గత ఏడాది పరీక్షా కేంద్రంపై వచ్చిన ఆరోపణలను దృష్టిలో ఉంచుకొని ఏడాది ఎలాంటి అవినీతి అక్రమాలకు తావు లేకుండా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని పరీక్ష కేంద్ర కేంద్ర చీఫ్ సూపరిండెంట్ ఎస్ ప్రభాకర్, డిపార్ట్మెంట్ అధికారి కేవీ కిరణ్ కుమార్ తెలిపారు.

## నేషనల్ చెస్ ఛాంపియన్ షిప్‌కి ఎంపికైనా కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థిని ఎన్. లహరి

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 21**

ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. ఈ పోటీలో కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల లో చివరి సంవత్సరం చదువుతున్న ఎన్.లహరి చెస్ గేమ్ లో మంచి ప్రతిభ కనబరిచి నేషనల్ మహిళా చెస్ ఛాంపియన్ షిఫ్ కు ఎంపిక కావడం జరిగింది. ఈనెల 21 నుంచి 23 తేదిలలో విశాఖపట్నం గీతం యూనివర్సిటీలో జరిగే నేషనల్ చెస్ ఛాంపియన్ షిఫ్ లో లహరి పాల్గొంటారు. ఈ సందర్భంగా కనిగిరి మాజీ ఎమ్మెల్యే విద్యాసంస్థల వ్యవస్థాపకులు కదిరి బాబురావు, చైర్మన్ కె.వి ప్రకాశ్ రావు, సెక్రటరీ ఒకరెస్పాండంట్ కదిరి పార్థసారధి, డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్, అధ్యాపకులు, లహరి ని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఛాంపియన్ షిఫ్ లో మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.



# పేదల విద్య, వైద్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

## 85 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి గొట్టిపాటి- రవికుమార్





**అద్దంకి(ఆర్సి ఇంచార్జ్), పెన్ పవర్, ఫిబ్రవరి 21**

రాష్ట్రంలోని పేదలకు నాణ్యమైన వైద్యం, విద్యను అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ స్పష్టం చేశారు. శనివారం సంతమాగులూరు మండలం, పుట్టావారిపాలెంలోని అతిథి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 85 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు, అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న బలహీన వర్గాలకు సీఎంఆర్ఎఫ్ కొండంత అండగా నిలుస్తోందన్నారు. కార్పొరేట్ స్థాయి వైద్యం పేదలకు అందాలనే ఉద్దేశంతో ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**వైసీపీ తీరుపై మంత్రి ధ్వజం**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీరుపై మంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్వార్థ రాజకీయాల కోసం దేవుడిని వాడుకుంటున్న నీచ చరిత్ర వైసిపి పార్టీదేనని విమర్శించారు. చట్టసభల్లో దేవుడి ఫోటోలతో రాజకీయ నినాదాలు చేయడం దేశ చరిత్రలోనే ఎక్కడా జరగలేదని, ఇటువంటి అపచారాలను ప్రజలు ఎన్నటికీ ఉపేక్షించరని హెచ్చరించారు. తప్పులు చేస్తూ మళ్ళీ బుకాయించడం వైసీపీ నేతలకే చెల్లుతుందని, వారి పాపాలను భరించడానికి ప్రజలు సిద్ధంగా లేరని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వల్లూరమ్మ అమ్మవారి సన్నిధిలో పాములపాటి మాధవ ప్రసాద్



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 21**

ప్రకాశం జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన వల్లూరు గ్రామంలోని వల్లూరమ్మ అమ్మవారి దేవస్థానాన్ని మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పాములపాటి మాధవ ప్రసాద్ సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి పి. రమేష్ ఆదేశాల మేరకు ఆలయ అర్చకులు పాములపాటి మాధవ ప్రసాద్ ను గోత్రనామాలతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. అనంతరం వారికి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పాములపాటి మాధవ ప్రసాద్ మాట్లాడుతూ వల్లూరమ్మ అమ్మవారి క్షేత్రం ప్రకాశం జిల్లాలో అత్యంత మహిమాన్వితమైన పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందిందన్నారు. భక్తుల కోరికలను తీర్చే కల్పవల్లి స్వరూపిణిగా అమ్మవారు వెలసి ఉన్నారని, వల్లూరమ్మ తల్లి అనుగ్రహంతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని ప్రార్థించినట్లు తెలిపారు.

# మిన్నేకల్లులో ఇంటి తలుపులు పగలగొట్టి దొంగతనం

## రెండు సవర్ల బంగారం, ఎల్ఈడీ టీ.వీ అపహరణ



**అద్దంకి(ఆర్సి ఇంచార్జ్), పెన్ పవర్, ఫిబ్రవరి 21**

సంతమాగులూరు మండలం, మిన్నేకల్లు గ్రామంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి తలుపులు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గాడిపర్తి. మల్లేశ్వరి (55) భర్త కోటేశ్వరరావు నివాసంలో శనివారం తెల్లవారుజాము సమయంలో దొంగలు చొరబడ్డారు. ఇంటి తలుపులు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన నిందితులు, బీరువాలో ఉన్న ఒక బంగారు గొలుసు, రెండు చిన్న పిల్లల బంగారు ఉంగరాలు (మొత్తం రెండు సవర్ల బంగారం) తో పాటు ఒక ఎల్ఈడీ టీ.వీని దొంగిలించుకుపోయారు. బాధితురాలు శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో సంతమాగులూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్.ఐ పట్టాభిరామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దొంగతనం జరిగిన తీరును బట్టి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్.ఐ తెలిపారు.



# గిద్దలూరుకు 50 పడకల ఆయుష్ ఆసుపత్రి మంజూరు

## ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 21**

గిద్దలూరు నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలనే సంకల్పంతో చేసిన ప్రయత్నానికి ఫలితంగా గిద్దలూరులో 50 పడకల సమగ్ర ఆయుష్ ఆసుపత్రి నిర్మాణానికి రూ.15 కోట్ల పరిపాలనా అనుమతి ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.2 కోట్ల నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. గిద్దలూరు ప్రాంత ప్రజలు మెరుగైన వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఈ ఆసుపత్రి మంజూరు కోసం చేసిన ప్రయత్నం సఫలీకృతం అయిందన్నారు. ఈ వైద్యశాల విషయం ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లడం జరిగిందని. చివరకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఈ ఆసుపత్రిని మంజూరు చేయడం గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధికి ఒక ముఖ్యమైన అడుగన్నారు ఈ సమగ్ర ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటుతో గిద్దలూరు, పరిసర ప్రాంతాల ప్రజలకు ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ, హోమియోపతి వైద్య సేవలు ఒకే చోట అందుబాటులోకి రానున్నాయన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం గా, ప్రజలకు అవసరమైన వైద్య, విద్య, మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని శాసన సభ్యులు ముత్తుముల అశోకరెడ్డి తెలిపారు.

# ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో

**పుల్లల చెరువు పెన్ పవర్ ఫిబ్రవరి 21**

పుల్లల చెరువు మండలం గారపెంట చెంచు గూడెం ఆశ్రమ పాఠశాలను ఎంపీడీవో మరియదాస్ శనివారం ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందిస్తున్నారా లేదా అన్న దానిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.పాఠశాల వంటశాలను సందర్శించిన ఎంపీడీవో మరియదాస్ మెనూలో ఉన్న వంటకాలు, వాటి నాణ్యత, పరిమాణం, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి భోజనం రుచి, పరిమాణం, సమయపాలనపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. భోజన సరఫరాలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పోషకాహారం అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని ఆయన సూచించారు.అలాగే వంటగది పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, నిల్వ ఉంచిన సరుకుల నాణ్యతను కూడా తనిఖీ చేశారు.రికార్డులను పరిశీలించి, హాజరు నమోదు, మెనూ పట్టికలు సరైన



విధంగా నిర్వహిస్తున్నారా లేదా అన్న విషయాన్ని ఆరా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని సిబ్బందికి స్పష్టం చేశారు.విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఎటువంటి నిర్లక్ష్యం వహించిన సహించబోమని ఎంపీడీవో హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చక్రవర్తి,ఏపీఓ మోషే, హౌసింగ్ ఏఈ ప్రధానోపాధ్యాయులు, వార్డెన్ పాల్గొన్నారు.

# ఛలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేయండి

## - ఎస్ టి యూ మార్కాపురం జిల్లా అధ్యక్షులు

## - టి.కె.యస్ .ప్రసాద్ ఆధ్వర్యంలో సమర శంఖం పోస్టర్ ఆవిష్కరణ



**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 21**

కూటమి ప్రభుత్వం ఎన్నికలలో భాగంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర ఎస్టీయూ శాఖ ఇచ్చిన సూచనల మేరకు దశల వారి నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని కార్యక్రమంలో భాగంగా ఈనెల 25వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు జిల్లా ఎస్టీయూ శాఖ అధ్యక్షులు టి.కె.యస్ .ప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిద్దేశ్వర శర్మ గారి సమక్షంలో ఎస్టీయూ సమర శంఖం పోస్టర్ ను జిల్లా అధ్యక్షులు ఆవిష్కరింప చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు టి.కె.యస్ .ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఎస్టియు రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపుమేరకు దశల వారి పోరాటం లో భాగంగా జనవరి 30 న అన్ని మండల కేంద్రాల్లో తహసిల్దార్లకు మేనిఫెస్టో హామీలు అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించా మని, రెండవ దశలో పోరాటంలో భాగంగా మార్కాపురం జిల్లా కలెక్టరేట్ ఆఫీసు ఎదురుగా మార్కాపురం జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున తరలివచ్చిన ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులతో ధర్నా నిర్వహించామని, ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుండి నిర్దిష్టమైన హామీ లభించకపోవడంతో ఫిబ్రవరి 25 న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టి విజయవాడ అలంకార్ సెంటర్లోని ధర్నా కేంద్రం వద్ద రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి పెద్ద ఎత్తున ఎస్ టియు సంఘం నాయకులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తరలి వెళ్లి ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. జిల్లా మహిళా ఉపాధ్యక్షులు మేరి క్యారిలియన్ మాట్లాడుతూ 11వ పిఆర్సి గడువు పూర్తయి 30 నెలలు గడిచిన 12వ పిఆర్సి కమిటీని ఏర్పాటు చేయకపోవడం రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల లో తీవ్ర ఆందోళన నెలకొని ఉన్నదని తెలియజేశారు. వెంటనే 12 వ పిఆర్సి కమిషన్ కు చైర్ పర్సన్ నియమించి 30 శాతం తగ్గకుండా మధ్యంతర భృతి(ఐఆర్) మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టియు జిల్లా కౌన్సిలర్ శివాపురం రమేష్ బాబు మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ మెమో 57 మేరకు 2004 సెప్టెంబర్ కు మునుపు నోటిఫికేషన్ ద్వారా నియమింప బడిన 2003 డిఎస్సీ ఉపాధ్యాయులు పోలీసులు ఇతర విభాగాలలో నియమించబడిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని సత్వరం అమలు చేయాలి అని డిమాండ్ చేశారు. ఎస్టీయూ గిద్దలూరు మండల గౌరవ అధ్యక్షులు సూరె. చెంచయ్య మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న నాలుగు డి. ఎ లను వెంటనే మంజూరు చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించవలసిన ఆర్థిక బకాయిలు సుమారు 35 వేల కోట్ల రూపాయలు కొండలా పేరుకు పోయాయని దశలవారీగా ఆర్థిక బకాయిలు చెల్లించాలని, రిటైర్ అయిన ఉద్యోగులకు 2024 ఆగస్టు మాసం నుంచి గ్రాట్యూటీ, సరెండర్ లీవ్ నగదు చెల్లించడం లేదని, వివిధ అవసరాల నిమిత్తం పొదుపు చేసుకున్న పిఎఫ్, ఏపీజిఎ ల సొమ్ములు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ మార్కాపురం జిల్లా అదనపు ప్రధానకార్యదర్శి యమ్ జయశ్రీ కార్యవర్గ సభ్యులు ప్రతాప్ రెడ్డి, వెంకట రామి రెడ్డి, గురునాథ రెడ్డి, పి. నాగేశ్వర రావు, విశ్వనాథరెడ్డి, వెంకటేశ్వర్లు, రిబ్కా,జ్యోతి, ఆనంద కుమారి, రత్నావళి, కరుణానిధి, వింధ్యావతి, శాంతకుమారి , ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ సంస్థ ద్వారా శనగలు కనీసం మద్దతు ధర

## క్వింటాకి రూ.5875/-కొనుగోలు

## శనగ రైతులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలి

## మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 21**

గిద్దలూరు మండలంలోని శనగ పంట వేసిన రైతులకు ప్రస్తుతం మార్కెట్లో శనగల ధర చాలా తక్కువగా క్వింటా రూ. 5000/- ఉండడం వలన ప్రభుత్వం ఏపీ మార్కెట్ సంస్థ ద్వారా కనీసం మద్దతు ధర క్వింటాకి రూ.5875/- కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నదని , శనగ పంట వేసిన రైతులందరూ కూడా మీ గ్రామంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి "సమగ్ర వ్యవసాయ ధరలు , సేకరణ పర్యవేక్షణ" లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకొనుటకు పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డ్ , మొబైల్ నెంబరు తమ వెంట తీసుకోని వెళ్లాలని రైతులకు తెలిపారు. రైతులు పండించిన పంటను కొనుగోలుకు తీసుకొచ్చే సమయానికి గింజలు కనీస నాణ్యత పరిమాణాలు కలిగి ఉండాలని తెలుపుతూ గింజలలో తేమ శాతం 14 శాతం ఉండేవిధంగా చూసుకోవాలని, పుల్లలు మట్టి పెళ్ళలు రాళ్లు మొదలైనవి లేకుండా ఉండేలా చూసుకోవాలని తెలిపారు.

# సింగరకొండపాలెంలో ఘనంగా స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర



**అద్దంకి(ఆర్సి ఇంచార్జ్), పెన్ పవర్, ఫిబ్రవరి 21:**

అద్దంకి మండలం, సింగరకొండపాలెం గ్రామ పంచాయతీలో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ బి. వరూధిని ఎస్.హెచ్.జి మహిళలకు తడి, పొడి వ్యర్థాలను వేరు చేయడంపై కీలక అవగాహన కల్పించారు. చెత్తను వేరు చేసి క్లాప్ మిత్రలకు అందించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, గ్రామాల్లో కంపోస్ట్ పిట్‌ల ఏర్పాటు ప్రాధాన్యతను తెలియజేశారు. విద్యార్థులు, మహిళలతో కలిసి గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి, స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను శుభ్రపరిచి పారిశుధ్యంపై చైతన్యం నింపారు. గ్రామంలో కొనసాగుతున్న యూఎఫ్ఎస్ సర్వేను ఎంపీడీఓ పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంజీఓ బి. సునీత, ఎంఈఓ కె. వి. శ్రీనివాసరావు, పీడీఓ చెన్నయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ, వెలుగు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# స్వచ్ఛమైన గాలి ఆరోగ్యకరం...

## ఎంపీడీవో ఖాసింపిరా




**అర్ధవీడు, పెన్ పవర్, ఫిబ్రవరి 21**

స్వచ్ఛమైన గాలి అందరికి ఆరోగ్యకరమని ఎంపీడీవో ఖాసిం పీరా అన్నారు. శనివారం మండల కేంద్రమైన అర్ధవీడు ఎంపీడీవో కార్యాలయం నందు స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రపై అందరితో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "పర్యావరణ పరిరక్షణ మరియు గ్రామాల్లో పరిశుభ్రత కాపాడటానికి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కీలకమైనదన్నారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛతపై అవగాహన పెంచుకోవాలి" అని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో భాగంగా, మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పరిశుభ్రతను ప్రోత్సహించేందుకు వివిధ చర్యలను తీసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. స్వచ్ఛ మైన గాలి ఆరోగ్యకరమన్నారు. ప్రతి గ్రామంలో చక్కటి పారిశుధ్య పరిస్థితిని నెలకొల్పడం కోసం ప్రజల భాగస్వామ్యంతో కఠినమైన చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. అలాగే గ్రామాలలో పర్యావరణానికి హానికరమయ్యే ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించే చర్యలు కూడా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిబ్బంది, మండలంలోని వివోఏలు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కేసులతో ప్రజా గొంతుకలను అడ్డుకోలేరు

### వైసీపీ మైనార్టీ నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఫిబ్రవరి 21**

రాష్ట్రం లో వైసీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించి ప్రజల గొంతుకగా ఉన్న వారిని అడ్డుకోలేరని వైసీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ పేర్కొన్నారు. అంబటి రాంబాబు పై అక్రమ కేసులు బనాయించి ప్రజల గొంతుకగా మారుతున్న ఆయనను అడ్డుకోవాలని కూటమి సర్కార్ ప్రయత్నించిందని ఆయన విమర్శించారు. కానీ అక్రమ కేసులు ఆయనను ఏమి చేయలేకపోయాయని మరింత రచించిన ఉత్సాహంతో ఆయన ప్రజల గొంతుకుగా ముందుకొస్తున్నారని వెల్లడించారు. ఇకనైనా కూటమి సర్కార్ అక్రమ కేసులపై పెట్టే శ్రద్ధను అభివృద్ధి వైపు పేడితే రాష్ట్రం బాగుపడుతుందని ఆయన హితువు పలికారు. కూటమి సర్కా తన తీరు మార్చుకోకపోతే ప్రజలే ఎన్నికల్లో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాష్ట్రం లో కూటమిపాలన కనిపించడం లేదని విమర్శించారు. అభివృద్ధి చేయాల్సిన కూటమినేతలు కేవలం శంకుస్థాపనలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు ఆశిస్తున్నది శంకుస్థాపనలు కాదని ఆచరణలో అభివృద్ధి అని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# జిల్లా ప్రథమ స్థానం సాధించి...

### రాష్ట్ర స్థాయికి దూసుకెళ్లిన స్పందన విద్యార్థిని!

**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 21**



జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఒంగోలులో నిర్వహించిన జిల్లా స్థాయి "వక్త" పోటీలలో స్పందన హై స్కూల్ విద్యార్థిని పి.లలితాలహరి అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ఈ విజయంతో ఆమె రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించి జిల్లా పోటీలకు అర్హత పొందిన లలితా లహరి, జిల్లా వేదికపై తన వక్తృత్వ నైపుణ్యంతో న్యాయనిర్ణేతలను , ప్రేక్షకులను ఆకట్టుకుంది. స్పష్టమైన ఉచ్చారణ, విషయంపై పట్టు, ఆత్మవిశ్వాసంతో కూడిన ప్రదర్శన ఆమెకు ఈ ఘన విజయం సాధించిపెట్టాయి. విజేతకు హృదయపూర్వక అభినందనలు పోటీ ఏదైనా... వేదిక ఏదైనా... విజయం మాత్రం స్పందనదేనని మరోసారి నిరూపించిన విద్యార్థినిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా ఆమె ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయపతాకం ఎగరేయాలని ఆశీర్వదించారు. స్పందన విద్యాసంస్థలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాయని యాజమాన్యం పేర్కొన్నారు. విద్యార్థినికి తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలియజేశారు.

# విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలి

### కమలా కాన్సెప్ట్ స్కూల్లో

### క్రియేటివ్ లెవెల్ కలరింగ్ కాంపిటీషన్



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఫిబ్రవరి 21**

స్థానిక కమలా కాన్సెప్ట్ స్కూల్లో ఐకాన్ ఫౌండేషన్ డైరెక్టర్ డి.వీ పాల్ నిర్వహణలో క్రియేటివ్ స్కూల్ లెవెల్ కలరింగ్ కాంపిటీషన్ -2026 జరిగింది. ఈ కార్యక్రమంలో అత్యధికంగా 430 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమలా కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ ఎంపీ పుల్లయ్య, ఐకాన్ ఫౌండేషన్ డైరెక్టర్ డీ.వీ పాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. పెయింటింగ్ కాంపిటీషన్స్ విద్యార్థులు పెయింటింగ్స్ చక్కగా వేసి ఆకట్టుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయటానికి చిత్రలేఖన పోటీలు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఆసక్తి కలిగిన పిల్లలందరూ కూడా చక్కగా పెయింటింగ్ వేసిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. విద్యార్థిని, విద్యార్థులు తమ ప్రతిభను కనబరచి బహుమతులు పొందారు.

# తాటిచెర్లలో శ్రీరామ మొక్కజొన్న సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్ ఫ్యాక్టరీకి ప్రారంభోత్సవం

### ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తో పాటు కనిగిరి ,పర్చూరు, మార్కాపురం శాసనసభ్యులు, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఏలూరు సాంబశివరావు, కందుల నారాయణరెడ్డి, ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జి గూడూరి ఎలక్షన్ బాబు.

**కొమరోలు పెన్ పవర్ ఫిబ్రవరి 21**

కొమరోలు మండలం తాటిచెర్ల పంచాయతీలోని తాటిచెర్ల గ్రామంలో శనివారం శ్రీరామ మొక్కజొన్న సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్ ఫ్యాక్టరీకి ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కృషితో, సహకారంతో తాటిచెర్ల గ్రామానికి శ్రీరామ మొక్కజొన్న సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్ ఫ్యాక్టరీ మంజూరు అయింది. ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించగా ,ఆ కార్యక్రమానికి గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, పర్చూరు శాసనసభ్యులు ఏలూరు సాంబశివరావు ,మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి. ఎర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం నేతలు మాట్లాడుతూ, మొక్కజొన్న సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా రైతులకు నాణ్యమైన మొక్కజొన్న విత్తనాలు అందుబాటులోకి రావడంతో పాటు ,స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. వ్యవసాయ రంగానికి సాంకేతిక ఆధునికతను అందించడం ద్వారా ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని వారు పేర్కొన్నారు. రైతు బలపడితేనే రాష్ట్రం బలపడుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా



చంద్రబాబు నాయుడు బలంగా నమ్ముతున్నారని ,అందువల్లనే రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లుగా వారు తెలిపారు. అనంతరం నేతలు శ్రీరామ మొక్కజొన్న సీడ్స్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని పరిశీలించి పనితీరును సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నేతలకు శ్రీరామ కంపెనీ ప్రతినిధులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు ..ఆ కార్యక్రమంలో గిద్దలూరు , కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్లు బైలడుగు బాలయ్య ,భూపాల్ రెడ్డి, కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్,



కొమరోలు, ఎడమకల్లు సహకార సంఘాల అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి, బిజ్జం రవీంద్రారెడ్డి, గిద్దలూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి ,డైరెక్టర్లు షేక్ హసీనా , తిరుమలరెడ్డి, గజ్జలకొండ నారాయణ తో పాటు కొమరోలు మండలానికి చెందిన పలువురు తెలుగుదేశం ,జనసేన,,బిజెపి పార్టీల నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మార్చి 8న పట్రా నాయుళ్ల సంఘం ఆధ్వర్యంలో బ్రహ్మంగారిమఠంలో అన్నదాన సత్రం, కళ్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమాలు.

### ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన పట్రా నాయుళ్ల సంఘం ప్రతినిధులు

### భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమాలకు హాజరై విజయవంతం చేయాలని నేతల పిలుపు.



**కొమరోలు పెన్ పవర్ ఫిబ్రవరి 21**

వైయస్సార్ కడప జిల్లా బ్రహ్మంగారిమఠం లో పట్రా, నాయుళ్ల సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన అన్నదాన సత్రం కళ్యాణ మండపం భవనాల సముదాయాలకు వచ్చేనెల 8వ తేదీన ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఏర్పాటు చేశామని కొమరోలు జడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు, ప్రకాశం జిల్లా పట్ర నాయుళ్ల సంఘం అధ్యక్షులు కూనపులి గంగి నాయుడు, ఉపాధ్యక్షులు దాసరి చిన్న లక్ష్మయ్య తెలిపారు. బ్రహ్మంగారిమఠంలో పట్రా నాయుళ్ల సంఘం ఆధ్వర్యంలో అన్నదాన సత్రం కళ్యాణమండపం ఏర్పాటు చేయాలనే తమ సంఘం చిరకాల కోరిక ఈనెల 8వ తేదీన సాకారం కానున్నదని వారు తెలిపారు .పట్రా నాయుళ్ల సంఘం ప్రతినిధులు, సభ్యులు, సంఘ శ్రేయోభిలాషుల సహకారంతో బ్రహ్మంగారిమఠంలో అన్నదాన సత్రం కళ్యాణ మండపం భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయని వారు తెలిపారు. ఎంతోకాలంగా బ్రహ్మంగారిమఠంలో అన్నదాన సత్రం కళ్యాణ మండపం నిర్మించాలనే ఆలోచన తమకు ఉండేదని ,ఎట్టకేలకు ఆలోచన కార్యరూపం దాల్చడం తమకెంతో సంతోషంగా, గర్వకారణంగా ఉన్నదని వారు పేర్కొన్నారు .మార్చి 8వ తేదీన బ్రహ్మం గారి మఠంలో నిర్వహించనున్న కళ్యాణ మండపం ,అన్నదాన సత్రం భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన ఆహ్వాన శుక్రవారం కొమరోలు జడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు నివాస గృహంలో వెంకట నాయుడు ఆధ్వర్యంలో పట్రా నాయుళ్ళ సంఘం ప్రతినిధులు శనివారం ఆవిష్కరించారు .సదరు ఆహ్వాన పత్రాలను మండలంలోని అన్ని గ్రామాలలో పంపిణీ చేసి అందర్నీ ఆహ్వానిస్తున్నట్లుగా వారు పేర్కొన్నారు. ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ కార్యక్రమంలో కొమరోలు జడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు ,ప్రకాశం జిల్లా పట్రా నాయుళ్ల సంఘం అధ్యక్షులు గంగి నాయుడు, ఉపాధ్యక్షులు చిన్న లక్ష్మయ్య, ఎంపీటీసీ సభ్యులు డి ఆంజనేయులు ,మాజీ సైనికులు దాసరి వెంకటేశ్వర్లు ,మధవపల్లె గోనె చిన్న రంగయ్య ,వట్టివేప మానుపల్లె ఎర్ర నాగుల చిన్న ఓబులేసు, గుంతపల్లి గ్రామానికి చెందిన భూమా ఓబుళపతి, అక్కపల్లె గ్రామానికి చెందిన భూమా రమణయ్య, భూమా భాస్కర్ ,నిగినె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానిమోదీపై కాంగ్రెస్ పార్టీ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

### మాదినేని లక్ష్మణ్ డిమాండ్

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 21**



దేశ రాజధాని ఢిల్లీలోని భారత మండపంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రదర్శన చేపట్టిన ఘటనపై బిజెపి ఓబీసీ మోర్చా మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదినేని లక్ష్మణ్ తీవ్రంగా ఖండించారు. సమ్మిట్ వేదిక సమీపంలో కాంగ్రెస్ కార్యకర్తలు చేరుకుని దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ భారత్ సాంకేతిక నైపుణ్యాన్ని, ఆవిష్కరణలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు కేంద్ర ప్రభుత్వం గ్లోబల్ ఏఐ సమ్మిట్ ను ఘనంగా నిర్వహిస్తోందన్నారు. ప్రపంచ దేశాల ప్రతినిధులు, ప్రముఖ టెక్ దిగ్గజాలు, అంతర్జాతీయ నిపుణులు హాజరై కృత్రిమ మేధస్సు రంగంలో భారతదేశ అభివృద్ధి, భవిష్యత్ దిశపై చర్చలు జరుపుతున్న వేళ ఇలాంటి గందరగోళ పరిస్థితులు సృష్టించడం తగదన్నారు. భారతదేశం ప్రపంచ వేదికపై తన సాంకేతిక ప్రతిభను ప్రదర్శిస్తున్న కీలక సందర్భంలో రాజకీయ ప్రయోజనాల కోసం ఇలాంటి ఆందోళనలు చేపట్టడం కాంగ్రెస్ పార్టీకి మంచిది కాదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సృష్టించిన దౌర్జన్య పరిస్థితులపై ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ బాధ్యత వహించాలని, ప్రధాని నరేంద్ర మోదీ మరియు బిజెపి నాయకులపై చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ప్రజల మన్ననలు పొందిన క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా పేరు పొందిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పై చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధాకరమని అన్నారు దేశ సుపరిపాలన అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగుతున్న సమయంలో వ్యక్తిగత దోషములు చేయడం రాజకీయ సంస్కృతికి విరుద్ధమని అన్నారు దేశ అభివృద్ధి సాంకేతిక ప్రగతి వంటి ముఖ్యాంశాలపై రాజకీయ పార్టీలు సమన్వయముతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని, అంతర్జాతీయ వేదికలపై దేశ గౌరవాన్ని కాపాడడం ప్రతి భారతీయుడు బాధ్యత అని అన్నారు.

# దోపిడీకి వ్యతిరేకంగా శ్రామికులంతా ఐక్యంగా పోరాడాలి

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 21**

దేశంలో నేటికీ కొనసాగుతున్న కార్మికుల, కష్టజీవుల దోపిడీకి వ్యతిరేకంగా శ్రామికులంతా ఐకమత్యంతో పోరాడాలని సిపిఎం నాయకులు ఊసా వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన రెడ్ బుక్స్ డే కార్యక్రమంలో భాగంగా చదువుదాం సమాజాన్ని మార్చుదాం అనే అంశం గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, కష్ట జీవులను దోచుకోవడం నేటికీ కొనసాగుతున్నదని ఈ విధానాలకు వ్యతిరేకంగా శ్రామికులందరూ ఐక్యంగా పోరాడాలన్నారు. వి.ఐ.లెనిన్ రచించిన పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ సామ్రాజ్య వాదం అనే పుస్తకాన్ని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా




నాయకులు ఊసా వెంకటేశ్వర్లు, ఊసా రాజ్యలక్ష్మి, ఎస్ తిరుపతిరెడ్డి, నర్సింహులు, మోహన్, కొండలరావు పాల్గొన్నారు.

# నృసింహుని సన్నిధిలో ఎమ్మెల్యే ఇంటూరి



**వలేటివారిపాలెం, పెన్ పవర్ ఫిబ్రవరి 21**

అయ్యవారి పల్లి పంచాయతీ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మాలకొండ ను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం దర్శించుకున్నారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా పండితులు, అధికారులు ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ ను ఎమ్మెల్యే పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా దర్శన ఏర్పాట్లు చూడాలని సూపరింటెండెంట్ ప్రసాద్ కు ఎమ్మెల్యే సూచించారు. పలువురు భక్తులతో మాట్లాడి వసతుల గురించి వాకబు చేశారు. అన్న ప్రసాదం స్వీకరించడంతో పాటు భక్తుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆయన వెంట మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, పార్టీ నాయకులు కాకుమాని హర్ష, శనివారపు మాల్యాద్రి, కామినేని అశోక్, గొర్రెపాటి శ్రీను తదితరులు ఉన్నారు.

# చేవూరు కంప్లెక్స్‌లో టాలెంట్ టెస్ట్ నిర్వహణ

### 31 మంది హాజరు



**గుడ్లూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 21:**

మండలంలోని చేవూరు కాంప్లెక్స్ నందు అన్ని పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ జడ్.పి.హెచ్.ఎస్ చేవూరు నందు శనివారం నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్ కి మొత్తం 31 మంది విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు ఎం.గోవర్ధన్, బీ.హరిరామ్ లు పాల్గొన్నారు. ఈ టాలెంట్ టెస్ట్ లో విజేతలకు మొదటి బహుమతిగా రూ:1000/- లు, రెండవ బహుమతిగా రూ:600/-, మూడో బహుమతిగా రూ:400/- లతో పాటు మెడల్, మెమోంటో ఇవ్వడం జరిగిందని ఎంఇఓ లు తెలిపారు. అదే విధంగా పోటీలో పాల్గొన్న అందరికీ పెన్ను, ప్యాడ్, స్నాక్స్ అందించడం జరిగిందన్నారు. మధ్యాహ్న భోజనం కూడా ఏర్పాటు చేయడం జరిగినదన్నారు. ఈ కార్యక్రమంలో విజేతలకు బహుమతులు, ప్రైజ్ మనీ భోజనాలు, అన్నిటిని ఆవులవారిపాలెం ప్రధానోపాధ్యాయులు ఎస్.కే.మీరావలి ఏర్పాటు చేయగా, వీరికి మండల విద్యాశాఖ తరఫున ఎంఇఓ లు, కాంప్లెక్స్ తరఫున కాంప్లెక్స్ చైర్మన్ ఎన్..శ్రీనివాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. విజేతలు మొదటి బహుమతి ఎంపీపీఎస్ శాంతి నగర్ కు చెందిన సిహెచ్ అభిషేక్, రెండవ ప్రైజ్ సోమశేఖర్ ఎంపీపీఎస్ కర్లపాలెం మరియు ఎంపీపీఎస్ శాంతి నగర్ మూడవ బహుమతి ఎస్.కే.హర్షియా తెట్టు హైస్కూలు మరియు సీహెచ్ షణ్ముఖ శ్రీనివాస్ ఎంపీపీఎస్ కర్లపాలెం విద్యార్థులు కైవసం చేసుకున్నారు.

# పర్యావరణాన్ని కాపాడుకోవడం మన బాధ్యత





**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఫిబ్రవరి 21**

పర్యావరణాన్ని మనం కాపాడితే పర్యావరణం మనల్ని కాపాడుతుందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి అన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పిలుపుమేరకు ప్రతి నెల 3వ శనివారం నిర్వహించు స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ స్వర్ణాంధ్ర - స్వచ్ఛ నిర్వహించారు. మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి, మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, మార్కాపురం ఆర్డీవో , బిజెపి నాయకులు ఏలూరి రామచంద్రారెడ్డి మొదటగా కాలేజీ రోడ్లో ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి పంపిన సందేశాన్ని వినిపిస్తూ ప్రతి ఒక్కరి చేత ప్రమాణ ప్రమాణం చేయించారు.ఈ సందర్భంగా మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఈ ఆర్.ఆర్.ఆర్ సెంటర్ ముఖ్య ఉద్దేశం పర్యావరణానికి హానికరమైన ఎలక్ట్రానిక్ తదితర వస్తువులు సాధ్యమైనంత వరకు వాడకం తగ్గించుకోవాలని అన్నారు. అవసరమైతే కొత్తవి కొనుగోలు చేయకుండా పాత వాటిని తిరిగి ఉపయోగించుకోవాలని అటు తరువాత వాటిని పూర్తిగా రీసైకిల్ చేయాలని పిలుపునిచ్చారు. అటువంటి పర్యావరణానికి నష్టం చేసే వస్తువులను ఈ ఆర్ ఆర్ ఆర్ సెంటర్ సేకరిస్తారని త్వరలోనే దీనిపై పట్టణంలో మైకులతో ప్రచారం ద్వారా ప్రతి ఒక్కరికి తెలియపరుస్తామని ఇటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు స్వీకరించటానికి త్వరలోనే వాహనాలు కూడా పట్టణంలో అందుబాటులో తెస్తామని అన్నారు.ప్రకృతి పర్యావరణాన్ని మనం కాపాడితే అది భావితరాలకు ఎంతో మేలు చేస్తుందని ప్రతి ఒక్కరు తమ ఇంటి గురించి ఆలోచిస్తూ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# నేడు 6 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత.

**కొమరోలు పెన్ పవర్ ఫిబ్రవరి 21**



కొమరోలు మండలం తాటి చెర్ల మోటు సబ్ స్టేషన్ పరిధిలోని ఆరు గ్రామాలకు ఈ నెల 22వ తేదీ ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లుగా కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీని వాసులు తెలిపారు. మండ లంలో ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా అమలు జరుగుతున్న కొత్త లైన్ల ఏర్పాటులో భాగంగా ఈనెల 22వ తేదీ ఆదివారం తాటిచెర్ల మోటు సబ్ స్టేషన్ పరిధిలోని నాగిరెడ్డిపల్లి ,గుండ్రెడ్డిపల్లి, దద్దవాడ, అలసందలపల్లి, నారాయణ పల్లి ,వెంకటాంపల్లి గ్రామాలలో కొత్త లైన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆ కారణంగా ఆ గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయవలసి వస్తున్నదని ఆయన చెప్పారు .కావున విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

# రైతులకు విద్యుత్ సరఫరా వేళలు

### ఏ పీ సీ పీ డి సి ఎల్ ముండ్లపాడు సెక్షన్



**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 21**

రైతుల కు ఆదివారం నుండి విద్యుత్ సరఫరా వేళలను విద్యుత్ అధికారులు ప్రకటించారు , ఈవేళలను గమనించి రైతులు తమ బోర్ల ద్వారా పొలాలకు తడు లు కట్టు కోవాలని ఒక ప్రకటన లో తెలిపారు. సంజీవరాయుని పేట సబ్ స్టేషన్ నుండి వచ్చే సంజీవరాయుని పేట రూరల్ ఫీడర్ పరిధిలోని గ్రామాలైన దేవనగరం, దంతేరపల్లె, పరమేశ్వర నగర్ లకు మధ్యాహ్నం గం.12:00ల నుండి సాయంత్రం గం. 6:00ల వరకు మిగిలిన సమయం రాత్రి గం. 9:00 నుండి గం. 12:00 వరకు రెండు విడతలుగా వ్యవసాయ విద్యుత్ సరఫరా ఇవ్వబడుతుందని. గడికోట ఫీడర్ల పరిధిలోని గ్రామాలైన గడికోట, మిట్టమూసుసుల పల్లె, తుమ్మళ్ళ పల్లె లకు మధ్యాహ్నం గం. 12:00ల నుండి సాయంత్రం గం. 6:00ల వరకు మిగిలిన సమయం రాత్రి గం. 9:00 నుండి గం. 12:00 వరకు రెండు విడతలుగా వ్యవసాయ విద్యుత్ సరఫరా జరుగుతుందని దొడ్డంపల్లి ఫీడర్ పరిధిలోని గ్రామాలైన దొడ్డంపల్లి, ఓబుళాపురం, ఓబుళాపురం తండా లకు తెల్లవారుజామున గం. 3:00 నుండి మధ్యాహ్నం గం. 12:00 వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరా ఇవ్వబడునని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. రైతులు ప్రకటించిన వేళలను గమనించి ఆయా సమయాలలో వ్యవసాయ విద్యుత్ ను వినియోగించు కోవాలన్నారు.

# కొమరోలు ప్రభుత్వ హైస్కూల్లో మన ఊరి బడిని కాపాడుకుందాం పోస్టర్ ఆవిష్కరణ

### పోస్టర్ను ఆవిష్కరించిన ఎంఈఓ 2వెంకటరత్నం, ప్రధానోపాధ్యాయులు

**కొమరోలు పెన్ పవర్ ఫిబ్రవరి 21**

కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూలు లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో మన ఊరి బడిని కాపాడుకుందాం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.ఆ కార్యక్రమానికి యూటీఎఫ్ కొమరోలు మండల శాఖ అధ్యక్షులు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా కొమరోలు మండల విద్యాశాఖ అధికారి 2 బొర్రా వెంకటరత్నం ,కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివనాగేశ్వరరావు ,అల్లినగరం మునగనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు మామిడి పద్మజ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి యం. పిచ్చయ్య, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు .ఆ సందర్భంగా ఎంఈఓ 2 వెంకటరత్నం మాట్లాడుతూ మన ఊరి బడిలో మన విద్యార్థులను చేర్చుకొని పాఠశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని, ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ శిక్షణ పొందిన, అనుభవం గల ఉపాధ్యాయులు పనిచేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తు న్నారని ఆయన తెలిపారు ,ప్రభుత్వ పథకాలను అమలు చేస్తూ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు సహాయ సహకారాలు సౌకర్యాలు కల్పి స్తున్నారని ఆయన పేర్కొన్నారు .అందువల్ల తల్లిదండ్రులు కూడా తమ పిల్ల లను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి పాఠశాల అభివృద్ధికి విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు. ఆ కార్యక్రమంలో యూటీఎఫ్ యూటీఎఫ్ బాధ్యులు బాలయ్య, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి ,జనార్దన్ రాజు ,షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



# ఎన్ఫోర్స్మెంట్తో అసాంఘిక కార్యకలాపాల చెక్

### - కోడిపందెం స్థావరంపై పోలీసులు దాడులు

### - 8 మంది అదుపులోకి



**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 21**

ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో టాస్క్ ఫోర్స్ సీఐ యు. సుధాకర్ ఆధ్వర్యంలో ఎస్సై సుదర్శన్, ఏఎస్ఐ మహబూబ్బాషా, సిబ్బంది కలసి చీమకుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని గోనుగుంట గ్రామ పొలాలలో కోడిపందెం స్థావరంపై ఆకస్మికంగా దాడులు నిర్వహించి కోడిపందాలు నిర్వహిస్తున్న ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 6 మోటార్ సైకిళ్లు, 9 సెల్ ఫోన్లు , ఐదు కోళ్ళు, రూ. 29500/- నగదు స్వాధీనం చేసుకున్నారు. జూద క్రీడలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అలాగే, జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి కార్యక్రమాలకు సంబంధించి సమాచారం ఉంటే, వెంటనే డయల్ 112 నంబర్కు లేదా పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు మెసేజ్ ద్వారా తెలియజేయాలని ప్రజలను కోరారు.

# స్వచ్ఛతతో తోనే సంపూర్ణ ఆరోగ్యం

### - ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు






**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు ఫిబ్రవరి 21**

మనిషి ఆరోగ్యంగా జీవించాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఉందని ఒంగోలు ప్రతీ ఒక్కరూ తమ ఇంటి తోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని పివిఆర్ మునిసిపల్ బాలుర పాఠశాల ఆవరణలో జరిగిన సేవా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అందుకోసమే ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. అనేక రకాల కార్యక్రమాల ద్వారా ప్రజలకు ప్లాస్టిక్ నివారణ కోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. తడి చెత్త పొడి చెత్త విధానాన్ని కూడా తీసుకోవడం జరిగిందని అన్నారు. ప్లాస్టిక్ వాడటం వలన అనారోగ్య పాలవుతున్నారని అన్నారు. జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి మాట్లాడుతూ పరిశుభ్రత అనేది మన ఇంటి వరకే కాదని సమాజంలో కూడా ఒక బాధ్యతగా తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మన ఇంటి ముందు ఉన్న చెత్తను బయటపడేవేసి మనం శుభ్రంగా ఉన్నాం అనుకుంటే కుదరదని సమాజంలో అందరూ పరిశుభ్రత పాటిస్తూ సమాజం కూడా ఆరోగ్యవంతంగా ఉంటుందని అందువలన ప్లాస్టిక్ నివారణ కొరకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కూడా అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు, మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ (బుజ్జి), డివిజన్ టిడిపి అధ్యక్షులు గుంటూరు రాంబాబు, కార్పొరేటర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు, విద్యార్థిని విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# వేసవిలో నిరంతరాయంగా విద్యుత్ అందించాలి

### - ఏ.పీ.సీ.పీ.డీ.సీ.ఎల్ డైరెక్టర్లు






**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 21**

రానున్న వేసవిలో నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ అందించడం కోసం తీసుకోవలసిన చర్యలు వాటి ప్రణాళికలపై చర్యలు తీసుకోవాలని ఏ.పీ.సీ.పీ. డీ.సీ.ఎల్ డైరెక్టర్లు సూచించారు. శనివారం ఒంగోలులోని విద్యుత్ భవన్లో ఏ.పీ.సీ.పీ.డీ.సీ.ఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పి పుల్లారెడ్డి ఆదేశాలతో ఏ.పీ.సీ.పీ.డీ.సీ.ఎల్ డైరెక్టర్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర, రాష్ట్రాల ముఖ్య పథకాలైన ఆర్డీఎస్ఎస్, పిఎం సూర్య ఘర్, పిఎం కుసుం పురోగతి మీద, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, పరివర్తకాల పనితీరు, స్మార్ట్ మీటర్ల గురించి, విద్యుత్ శాఖ మీద ప్రజల అభిప్రాయం, విద్యుత్ కలెక్షన్లు బకాయిలు మీద సమీక్ష నిర్వహించారు. ఆర్డీఎస్ఎస్ పనులు వేగవంతం చేయాలని, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే విషయంలో అధికారులు ఎవరూ నిర్లక్ష్యం వహించకుండా త్వరగా పనులు పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే జిల్లాలో సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్లు అధికంగా ఏర్పాటు చేయడం కోసం ప్రతి ఒక్క విద్యుత్ అధికారి కృషిచేయాలని ఆదేశించారు. అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ అందరికీ అందించాలని దానికోసం ఫీడర్ పెట్రోలింగ్ చేసి లోపాలను సరి చేయాలని తద్వారా ప్రజలకు విద్యుత్ శాఖ పట్ల సంతృప్తి లెవెల్స్ పెరుగుతాయని తెలిపారు. పిఎం కుసుం పథకం అమలు కోసం కావలసిన భూముల సేకరణ త్వరతగతిన పూర్తి చేయాలని అదేశించడం జరిగింది. విద్యుత్ బకాయిల వసూలు కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్లు మురళీకృష్ణ యాదవ్, టివిఎస్ఎన్ మూర్తి, వెంకటేశ్వర్లు, సిస్ట, ఎస్.ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఈ ఈలు, డి ఈ ఈ లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాతృభాషను కాపాడుకుందాం

### - ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య



**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు ఫిబ్రవరి 21**

ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్ అండ్ క్లబ్ ఆవరణలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ కార్యక్రమం జరిగింది. తొలుత తెలుగు తల్లి చిత్రపటానికి పలువురు కవులు సాహితీవేత్తలు పుష్పమాలలు వేసి తెలుగు భాషను పరిరక్షించుకుందామని ప్రతిజ్ఞ చేశారు. జయహో తెలుగు తల్లి.... తెలుగు భాష వర్ధిల్లాలి అంటూ ఏక కంఠమై నినదించారు. అనంతరం సమాఖ్య గౌరవాధ్యక్షులు మిడసల మల్లికార్జునరావు పర్యవేక్షణలో జరిగిన సభా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య ప్రధాన కార్యదర్శి కుర్రా ప్రసాద్ బాబు మాట్లాడుతూ ఉగ్గుపాలతో వచ్చే మాతృభాషను కాపాడుకునేందుకు మనందరం కంకణ బద్దులు కావాలని పిలుపునిచ్చారు. భాషా సంస్కృతుల వైవిధ్యాన్ని కాపాడుకుంటేనే మన జీవన వైవిధ్యాన్ని కాపాడుకోగలమన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నాగభైరవ కళా పీఠ అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలోనే చిన్నారులు తెలుగు భాషలో పట్టు సాధించేలా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కృషి చేయాలని, తద్వారా భవిష్యత్తులో ప్రపంచ నలుమూలల తెలుగు భాష దేదీప్యమానంగా ప్రజ్వరిల్లుతుందని అన్నారు. ఈ సభా కార్యక్రమంలో వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు కనుమల రాఘవులు, అంగలకుర్తి ప్రసాద్, యువి రత్నం, గుంటూరు సత్యనారాయణ, పిన్ని వెంకటేశ్వర్లు ఓరుగంటి ప్రసాద్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కొప్పోలు వెంకటేశ్వర్లు, మద్దులూరి వెంకట సుబ్బారావు, వెన్నూరు నాగేశ్వరరావు, తాతా శ్రీనివాసులు, పొదిలి బాల గురవయ్య, మువ్వా నాగేశ్వరరావు, పాత శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# ఐటిఈ లో పేద విద్యార్థులు ఉచిత అడ్మిషన్లు

### - జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ దాసరి

**కలెక్టరేట్ ఒంగోలు,పెన్ పవర్ ఫిబ్రవరి 21**



ప్రకాశం జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలో ఐటిఈ 12(1)సి ప్రకారం అర్హులైన పేద విద్యార్థులు ఉచిత అడ్మిషన్లు కొరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ దాసరి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రైవేట్ పాఠశాలలో ఆర్ఐఎల్ (1) సి చట్టం ప్రకారం ప్రభుత్వం పేద, వెనుకబడిన వర్గాల పిల్లలకు ఉచితంగా ఒకటో తరగతిలో అడ్మిషన్ లకు అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. 2026 27 విద్యా సంవత్సరానికి గాను జిల్లాకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయిస్తామని వివరించారు. ఆసక్తి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు వారి నివాస ప్రాంతానికి సమీపంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలకు ఆన్లైన్లో నిబంధన మేరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీ నుంచి మార్చి 10వ తేదీ లోగా గ్రామ సచివాలయం లేదా మండల విద్యా వనరుల కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే వెబ్సైట్ లో విద్యార్థుల ఆధార్, ప్రాథమిక వివరాలు నమోదు చేసి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఉచిత ప్రవేశాలకు సంబంధించిన వివరాల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18004258599ను సంప్రదించాలని సూచించారు. మార్చి 25న మొదటి విడత లాటరీ విధానంలో ప్రభుతం సీట్లు కేటాయిస్తుందని స్పష్టం చేశారు.

# 50 లక్షలతో ఆయుష్ నూతన వైద్యశాల నిర్మాణం

### - భూమి పూజ చేసిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 21**

50 లక్షల రూపాయలతో నిర్మించిన నిర్మించ తలపెట్టిన ఆయుష్ శాఖ వైద్యశాలకు శనివారం స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు భూమ పూజ చేశారు. నగరంలోని రిమ్స్ ఆవరణలో యునాని, ఆయుర్వేదం, ఆయుష్ మూడు శాఖలకు సంబంధించిన బహుళ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయుష్ శాఖ రీజినల్ డైరెక్టర్ శేఖర్ రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆయుష్ శాఖను అభివృద్ధి పరిచే భాగంగా ప్రకాశం రీవిజన్ పరిధిలో కొన్ని ఆయుర్వేద ఆసుపత్రులకు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ కుమార్, ఆయుష్ శాఖ డాక్టర్ ఎం భ్రమరాంబ, సూపరింటెండెంట్ కోటేశ్వరమ్మ, ఆయుష్ సిబ్బంది పాల్గొన్నారు.

# 6 ఏళ్ల తర్వాత తన రికార్డును తానే బ్రేక్ చేసుకున్న స్మృతి మంధాన..





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన మరోసారి తన క్లాస్ బ్యాటింగ్ చూపించింది. ఈరోజు (ఫిబ్రవరి 21) అడిలైడ్ లోని ఓవల్ మైదానంలో ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టీ20లో చెలరేగిపోయింది. నిర్ణీత 20 ఓవర్లలో భారత్ 176/6 అనే స్కోర్ చేయడంలో మంధాన కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో స్మృతి 55 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సులతో 82 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడింది. రెండో వికెట్‌కు జెమిమాహ్ రోడ్రిగస్ తో కలిసి 82 బంతుల్లో 121 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. జెమిమా (59) సైతం హాఫ్ సెంచరీ చేసింది.

ఈ ఇన్నింగ్స్‌తో స్మృతి మంధాన తన కెరీర్‌లో 33వ టీ20 అంతర్జాతీయ అర్ధశతకం నమోదు చేసుకుంది. అంతేకాదు, ఆస్ట్రేలియాలో భారత బ్యాటర్‌గా అత్యధిక వ్యక్తిగత స్కోర్ చేసిన ప్లేయర్ గా ఆరేళ్ల రికార్డును కూడా చెరిపేసింది. గతంలో ఆమె 2020లో మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో 37 బంతుల్లో 66 రన్స్ చేసింది. ఇప్పుడు ఆ రికార్డును అధిగమించి నయా చరిత్ర సృష్టించింది. ఇదే సమయంలో, ఆస్ట్రేలియాపై మంధానకు ఇది 8వ 50 ప్లస్ స్కోర్ కావడం విశేషం. ఈ విషయంలో కూడా ఆమె టీమిండియా బ్యాటర్‌గా నెంబర్ స్థానంలో కొనసాగుతోంది. ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్ ప్రారంభంలో నాలుగో బంతికి బౌండరీతో ఖాతా తెరిచిన స్మృతి, మూడో ఓవర్‌లో షఫాలి వర్మ (7) వికెట్ పడిన తర్వాత పవర్‌ప్లే చివరి ఓవర్ వేసిన సోఫీ మోలినెక్స్ బౌలింగ్ లో మంధాన 3 ఫోర్లు కొట్టి బ్యాటింగ్ లో వేగం పెంచింది. జస్ట్ 38 బంతుల్లో

హాఫ్ సెంచరీ పూర్తి చేసిన ఆమె, ఆ తర్వాత గేర్ మార్చి సెంచరీ దిశగా దూసుకెళ్లింది. చివరకు అన్నాబెల్ సదర్లాండ్ బౌలింగ్‌లో డీప్ మిడ్‌వికెట్ వద్ద క్యాచ్ ఇచ్చి అవుట్ అయింది. ఇక మంధాన – జెమిమా భాగస్వామ్యంతో భారత్ ఈ కీలక మ్యాచ్‌లో భారీ స్కోర్ సాధించగలిగింది.

# భారత్ ఘన విజయం.. 2--1 తేడాతో ఆస్ట్రేలియాపై సిరీస్ కైవసం



**హైదరాబాద్ పెన్ పవర్:** అడిలైడ్ లోని ఓవల్ స్టేడియంలో జరిగిన 3వ ౨20లో భారత్-- ఆస్ట్రేలియా జట్లు తలపడ్డాయి. నిర్ణయాత్మకమైన మ్యాచ్ లో 17 పరుగుల తేడాతో టీమిండియా విజయం సాధించి.. దీంతో సిరీస్ ని భారత్ కైవసం చేసుకుంది. టాస్ గెలిచిన టీమిండియా ముందుగా బ్యాటింగ్ తీసుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో భారత మహిళల జట్టు 6 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. టీమిండియా బ్యాటర్లలో స్మృతి మంధాన (55 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సులతో 82 పరుగులు) హాఫ్ సెంచరీ చేయగా, జెమిమా రోడ్రిగ్స్ (59) కూడా అర్ధ శతకంలో టీం భారీ స్కోర్ సాధించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ మ్యాచ్లో 177 పరుగుల టార్గెట్ తో బరిలో దిగిన ఆస్ట్రేలియాను 159/9 పరుగులకే టీమిండియా బౌలర్లు పరిమితం చేశారు. ఆష్లీ గార్డనర్ 57 హాఫ్ సెంచరీ చేయగా, లిచ్ఫీల్డ్ 26 దూకుడుగా ఆడినప్పటికీ ఆసీస్ ను మాత్రం గెలిపించడంలో విఫలమయ్యారు. వీరు ఇద్దరు మినహా మిగతా అందరూ బ్యాటర్లు తక్కువ పరుగులకే ఔట్ కావడంతో భారత్ ఈజీగా విజయం సాధించింది. టీమిండియా బౌలర్లలో శ్రీచరణి, శ్రేయాంక తలో 3 వికెట్లు, అరుంధతి రెడ్డి 2 వికెట్లు, రేణుక సింగ్ ఒక వికెట్ తీసుకుంది. ఆస్ట్రేలియా మహిళల జట్టుపై భారత్ ఘన విజయం సాధించడంతో పాటు ఈ సిరీస్ ని కైవసం చేసుకుంది. దీంతో ఆసీస్ గడ్డపై భారత్ మహిళల జట్టుకు ఇదే తొలి సిరీస్ విజయం. మ్యాచ్ అనంతరం భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ.. ఈ సిరీస్ విజయంపై ఆనందంగా ఉంది. ఈ విజయం మాకు చాలా ప్రత్యేకమైనది.. ఇది పూర్తిగా టీమ్ ఎఫర్ట్.. ప్రతి ఒక్కరూ జట్టుకు ఏదో ఒక విధంగా సహకరించడం చాలా సంతోషంగా ఉందని తెలిపింది. జెమిమా రోడ్రిగ్స్, స్మృతి మంధాన భాగస్వామ్యంపై సరైన సమయంలో వచ్చింది.. వారు ఇద్దరు జట్టుకు వారు పెద్ద బలంగా మారారు అని హర్మన్‌ప్రీత్ పేర్కొంది. ఇక మేం వికెట్లు తీసినప్పుడే మ్యాచ్ మన వైపు తిరుగుతుంది.. ఆస్ట్రేలియా లాంటి బలమైన జట్టు వికెట్లు తీయడం అంత సులభం కాదు.. కానీ మా బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేసి వికెట్ల పడగొట్టడంతో ఈ మ్యాచ్ గెలిచామని వెల్లడించింది. భారత్ చేతిలో ఓటమిపై ఆస్ట్రేలియా కెప్టెన్ సోఫీ మోలినెక్స్ మాట్లాడుతూ.. మంచి వికెట్‌పై టీమిండియాను కట్టడి చేశాం.. కానీ కీలక సమయంలో వికెట్లు కోల్పోవడమే మాకు తీవ్ర నష్టం కలిగించిందని తెలిపింది. పెర్రీ కోసం ఈ మ్యాచ్ గెలవలేకపోయినందుకు కొంచెం బాధగా ఉంది.. ఆమె మాకు అందరికీ పెద్ద ఇన్స్పిరేషన్.. ఆమె మరెన్నో మ్యాచ్‌లు ఆడాలని కోరుకుంటున్నాం పేర్కొనింది. వచ్చే వన్డే సిరీస్‌లో అలీసా హీలీ జట్టులోకి రావడం మాకు పెద్ద ప్లస్ అవుతుంది.. ఆ సిరీస్‌లో పరిస్థితిని మార్చేందుకు మా వంతు ప్రయత్నం చేస్తామని సోఫీ మోలినెక్స్ చెప్పుకొచ్చింది.

# అభిషేక్ శర్మ ఫామ్ గురించి టెన్షన్ వద్దు.. సూర్యకుమార్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్..





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ పురుషుల టీ20 వరల్డ్ కప్ 2026లో అభిషేక్ శర్మ టాప్ రన్‌గెటర్‌గా నిలుస్తాడని క్రికెట్ విశ్లేషకులు అంచనా వేశారు. కానీ టోర్నీ ఆరంభంలోనే అభిషేక్ వరుసగా మూడు మ్యాచ్‌ల్లో డకౌట్ కావడంతో అతని ఫామ్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ విమర్శలపై భారత జట్టు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ గట్టిగా స్పందించాడు. దక్షిణాఫ్రికాతో జరిగే కీలక మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడిన స్కై, అభిషేక్ ప్రస్తుత ఫామ్ తనను ఏమాత్రం ఆందోళనకు గురి చేయడం లేదని స్పష్టం చేశాడు. అంతేకాదు, అతడిపై విమర్శలు చేసే వారిపైనే తనకు ఎక్కువ టెన్షన్‌గా ఉందని పేర్కొన్నాడు. అభిషేక్ శర్మ గురించి ఆందోళన చెందుతున్న వాళ్ల గురించి నేనే ఎక్కువగా ఆందోళన పడుతున్నాను అని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపారు. అతడు తర్వాత ఆడే జట్ల పరిస్థితి ఏంటో ఆలోచించాలి అని పేర్కొన్నాడు. గత ఏడాది అభిషేక్ జట్టు కోసం అన్నీ చేశాడు.. ఇప్పుడు మేము అతడికి మద్దతుగా నిలిచే సమయం వచ్చింది అని స్పష్టం చేశాడు. కాగా అభిషేక్ శర్మ సామర్థ్యంపై పూర్తి నమ్మకం ఉంది.. అతడు త్వరలోనే తన గత ఫామ్‌ను తిరిగి అందుకుంటాడని స్కై భాయ్ ధీమా వ్యక్తం చేశాడు. అదే సమయంలో సూర్యకుమార్ మాటలు ప్రత్యర్థి జట్లకు ఇది ఒక హెచ్చరికగా మారిందని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అభిషేక్ ఒక్కసారి ఫామ్‌లోకి వస్తే, ప్రత్యర్థి బౌలర్లకు కష్టకాలమేనన్న సందేశాన్ని సూర్య వ్యాఖ్యలతో క్లియర్ గా తెలిసిపోతుంది. వరుసగా విఫలమైతున్నప్పటికీ అభిషేక్ శర్మకు తుది జట్టులో స్థానం కొనసాగుతుందని బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కెల్ తెలిపారు. జట్టు మేనేజ్‌మెంట్‌లో అభిషేక్ ప్రదర్శనపై ఎలాంటి చర్చే జరగడం లేదని స్పష్టం చేశారు. అతను వరల్డ్ క్లాస్ ప్లేయర్, ఈ టోర్నీలో ఇప్పటి వరకు ఇతర ఆటగాళ్లు బాధ్యత తీసుకుని నిలబడ్డారు.. ఇప్పుడు వరల్డ్ కప్‌లో చాలా కీలక దశకు చేరుకున్నాం.. ఈ సమయంలో అభిషేక్ తప్పకుండా రాణిస్తాడనే నమ్మకం మాకు ఉందని మోర్నీ మోర్కెల్ ధీమా వ్యక్తం చేశాడు. టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్--8 దశలో భాగంగా రేపు (ఫిబ్రవరి 22న) అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి.

## ప్రగ్యా జైస్వాల్: ఎ విజన్ ఇన్ గోల్డెన్ గ్లో



# సిద్దు, నవీన్‌ల దారిలో రామ్...!



ఎనర్జిటిక్ స్టార్ రామ్ గత కొన్నాళ్లుగా సక్సెస్ కోసం చేయని ప్రయత్నం లేదు. ఇస్మార్ట్ శంకర్ తర్వాత ఆ స్థాయి విజయం రామ్ చూడలేదు. గత నాలుగు ఐదేళ్లుగా రామ్ చేస్తున్న సినిమాలు బాక్సాఫీస్ వద్ద వర్కౌట్ కావడం లేదు. గత ఏడాది 'ఆంధ్రా కింగ్ తాలూక' సినిమాతో రామ్ ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆ సినిమాకు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. రివ్యూలు కూడా పాజిటివ్‌గానే ఉన్నాయి. రామ్ నటనకు మంచి మార్కులు పడ్డాయి. దర్శకుడి యొక్క పనితనం కి కూడా మంచి మార్కులు పడ్డాయి. స్క్రీన్ ప్లే బాగుందని అంతా మెచ్చుకున్నారు. కానీ సినిమాకు కలెక్షన్స్ మాత్రం రాలేదు. చాలా మంది ఓటీటీలో సినిమాను చూసి వావ్ అన్నారు కానీ, థియేట్రికల్ రన్ సమయంలో మాత్రం అటువైపు వెళ్లలేదు. సినిమాకు ఎంత పాజిటివ్ రెస్పాన్స్ వచ్చినా ఓటీటీలో వచ్చే వరకు వెయిట్ చేద్దాం అన్నట్లుగానే ఉన్నారు.

**రామ్ ఆంధ్రా కింగ్ తాలూక సినిమా...**

ఆంధ్రా కింగ్ తాలూక సినిమా తర్వాత రామ్ సన్నిహితుల వద్ద చాలా ఆవేదన వ్యక్తం చేశాడని ఇండస్ట్రీ వర్గాల టాక్. ఆ సినిమా తర్వాత కాస్త గ్యాప్ తీసుకున్న రామ్ తిరిగి కొత్త సినిమా పనిలో పడ్డట్లుగా తెలుస్తోంది. ఇండస్ట్రీ వర్గాల నుంచి అందుతున్న విశ్వసనీయ సమాచారం ప్రకారం తనకు నమ్మకస్తుడు అయిన దర్శకుడు కిషోర్ తిరుమల వద్ద రామ్ ఒక కథను తీసుకున్నాడట. ఆ కథ తో పాటు మరో కథను రామ్ ఇప్పుడు డెవలప్ చేసే పనిలో ఉన్నాడు. రెండు కథల పై వర్క్ జరుగుతోంది. రామ్ కి ఒక రైటింగ్ టీమ్ ఉంటుంది. ఆ టీమ్ ఇప్పుడు ఆ రెండు కథలను ఫైనల్ చేసే విధంగా సిట్టింగ్స్ లో ఉన్నారు. ఇక్కడ చెప్పుకోవద్ద విషయం ఏంటంటే కథ చర్చల్లో రామ్ ప్రధానంగా పాల్గొంటున్నాడు. అధికారికంగా ఈ సినిమా కు రామ్ రైటర్ గా వ్యవహరించబోతున్నట్లుగా ఆయన సన్నిహితులు, మీడియా సర్కిల్స్ వారి ద్వారా సమాచారం అందుతోంది.

**సిద్దుజొన్నలగడ్డ, నవీన్ పొలిశెట్టి....**

ఇప్పటికే నవీన్ పొలిశెట్టి, సిద్దు జొన్నలగడ్డ వంటి యంగ్ హీరోలు కథ విషయంలో చాలా ఇన్వాల్వ్ అవుతారు. అంతే కాకుండా రైటింగ్ విషయంలో ఇద్దరు హీరోలు పూర్తి ఇన్వాల్వ్‌మెంట్ అవుతారని టాక్ ఉంది. టైటిల్ కార్డ్ పడకున్నా దర్శకత్వం సైతం ఈ హీరోలు చేస్తారు అనే టాక్ ఉంది. ఆ విషయం పక్కన పెడితే ఇప్పుడు రామ్ కూడా రైటింగ్ పై పూర్తి ఫోకస్ పెట్టాడని తెలుస్తోంది. చాలా సినిమాలు చేసిన అనుభవం ఉన్న రామ్ కి రైటింగ్ పై పట్టు ఉండటం చాలా కామన్ విషయం. అయితే పూర్తి ఇన్వాల్వ్‌మెంట్‌తో రైటింగ్ పై దృష్టి పెట్టడం ఎంతవరకు సాధ్యం అని కొందరు భావిస్తున్నారు. సినిమా షూటింగ్‌కి ముందు స్క్రిప్ట్ విషయంలో రామ్ ఇన్వాల్వ్‌మెంట్ ఉంటే మేకింగ్ సమయంలోనూ ఆయన ఇన్వాల్వ్‌మెంట్ ఉండే అవకాశం ఉంటుందని కొందరు అంటున్నారు. ఇప్పటి వరకు రామ్ తదుపరి సినిమా దర్శకుడు ఎవరు అనే విషయం లో క్లారిటీ రాలేదు.

**రామ్ నిర్మాణంలో కొత్త సినిమా...**

నవీన్, సిద్దు సినిమాలకు దర్శకులు కొత్త వారు పని చేస్తారు. దాంతో వీరి ఇన్వాల్వ్‌మెంట్ ఎక్కువగా ఉంటుందని అంటారు. అందుకే రామ్ సైతం తన తదుపరి సినిమాకి కొత్త దర్శకుడిని తీసుకుంటే అన్ని విధాలుగా బాగుంటుంది అనేది ఆయన కాంపౌండ్ ఆలోచనగా తెలుస్తోంది. కేవలం రైటింగ్ విషయంలోనే కాకుండా నిర్మాణంలోనూ రామ్ పాత్ర ఉండే అవకాశాలు ఉన్నాయి. తన సొంత బ్యానర్‌లో రామ్ ఈ సినిమాను నిర్మించే యోచన చేస్తున్నాడని తెలుస్తోంది. స్క్రిప్ట్ ఫైనల్ అయ్యాక నిర్మాతలు ఎవరూ సెట్ కాకుంటే అప్పుడు రామ్ సొంతంగా రంగంలోకి దిగడం ఖాయంగా కనిపిస్తుంది. మొత్తానికి రామ్ ఈసారి సొంత ప్రయోగం చేయాలని నిర్ణయించుకున్నాడు. మరి ఈ ప్రయోగం ఎంతవరకు సఫలం అవుతుంది అనేది చూడాలి. రామ్ గత చిత్రాల ఫలితాలు కచ్చితంగా రాబోయే సినిమాపై ఉంటుంది. దాన్ని అధిగమించే విధంగా ఈ సినిమా ఉండాలి అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

## నేహా శర్మ యొక్క బ్లాక్ మ్యాజిక్: స్వచ్ఛమైన చక్కదనం యొక్క విజన్



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com